ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -194 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 9 మే 2025



# కేంద్రం చర్యలకు ఏకగ్రీవంగా మద్దతు

## ముగిసిన అఖిలపక్ష సమావేశం

- వివరాలు వెల్లడించిన రాజనాథ్ సింగ్
- భారత్ భూభాగం నుంచే దాడులు
- భారత్ గగనతలం నుంచి రాఫెల్ విమానాల ద్వారా మిస్సైల్స్ ప్రయోగం
- మొత్తం తొమ్మిది క్యాంపులు ధ్వంసం
- 100 మందికిపైగా ఉగ్రవాదులు హతం
- 200 మందికి పైగా గాయాలు
- త్రివిద దళాలను అభినందించిన అఖిల పక్ష నేతలు



**న్యూ ఢిల్లీ -** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి.. ఉగ్రవాద పోరులో మోదీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న అన్ని పార్టీలు ప్రకటించాయి..

మిగతా 2లో




భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు- భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.

మిగతా 2లో

# దాడులు ప్రతిదాడులు

## పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

### లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం

- పాక్ రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు
- భారత్‌లో పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు
- సమర్థంగా తిప్పికొట్టిన రోణ దళాలు
- ఆయా ప్రాంతాల్లో డ్రోన్ శకలాల సేకరణలో అధికారులు
- భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న పాక్
- పౌరులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా
- శవపేటికలపై పాక్ జెండాలు కప్పడంలో అర్థం ఏమిటో
- పాకిస్థాన్‌లో ఇలాంటి ఆచారం ఉందేమో
- ఉగ్రవాదులు లక్ష్యంగానే భారత్ దాడులు
- గతంలో దాడులకు సంబంధించిన వివరాలు ఎన్నో ఇచ్చాం
- పాక్ దేనికి సరైన సమాధానం ఇవ్వలేక పోయింది
- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి



# మద్యం స్కామ్ కేసులో నిందితులకు షాక్



3లో

ధనుంజయ్ రెడ్డి తదితరకుల బెయిల్ తిరస్కరణ -విచారణ ఈ నెల 13కు వాయిదా వేసిన సుప్రీం

# రాజధానిగా అమరావతి



## నిర్ధారిస్తూ ఏపీ కేబినెట్ తీర్మానం

- చెరువు మట్టిని రైతులకు ఉచితంగా తరలించేందుకు అనుమతి
- వేదికలపై తన పక్కన పవన్ కల్యాణ్ కూర్చునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన




**అమరావతి,మే 08 ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనేక కీలకమైన నిర్ణయాలకు ఆమోదముద్ర లభించింది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, పరిపాలనా పరమైన పలు అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి కీలక తీర్మానాలు చేసింది.రాష్ట్ర మంత్రివర్గం 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఆపరేషన్ నిర్వహించిన త్రివిధ దళాలను అభినందిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అదేవిధంగా, అమరావతిలో పునర్నిర్మాణ పనులను ప్రారంభించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేబినెట్ ధన్యవాదాలు తెలియజేసింది. 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేసేందుకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది.ప్రధానంగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరును చేర్చే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మిగతా 2లో

# దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తే తాటతీస్తాం

- ఉగ్రవాదాన్ని ఎగదోస్తే..మీకు నూకలు చెల్లినట్లే
- భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడాల్సిందే
- సిందూర్ కు మద్దతుగా ర్యాలీలో సిఎం రేవంత్




**హైదరాబాద్,మే 08 ఆంధ్ర ప్రగతి :** ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని దయాది దేశం పాకిస్థాన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మిగతా 3లో

# రాసి పెట్టుకోండి... మామూలుగా ఉండదు

- : మరోసారి జగన్ వార్నింగ్
- వైసీపీ కార్యకర్తలను వేధిస్తున్న పోలీసు అధికారులను వదిలిపెట్టబోమన్న జగన్
- పోలీసు అధికారుల పేర్లు రాసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచన
- జగన్ 2.0లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని హామీ



**అమరావతి,మే 08 ఆంధ్ర ప్రగతి :** వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, అలాంటి పోలీసు అధికారుల పేర్లు రాసుకోవాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని, 'జగన్ 2.0'లో వారికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.మిగతాది 2లో...

# ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం

- శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శంకుస్థాపన
- ఆవిష్కరణలు పెట్టుబడులతో భవిష్యత్‌కు బాటలు
- కార్యక్రమంలో మంత్రి లోకేశ్ వెల్లడి




**తిరుపతి,మే 08 ఆంధ్ర ప్రగతి :** ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నామన్నారు. ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది.మిగతాది 2లో...

# మందుపాతర పేలుడు... ముగ్గురు పోలీసుల మృతి!

- ములుగు జిల్లా వాజేడులో మందుపాతర పేలుడు ఘటన
- మావోయిస్టుల కోసం కూంబింగ్ చేస్తుండగా దుర్ఘటన
- కర్రెగుట్టల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అడవుల్లో గాలింపు



**ములుగు మే 08 ఆంధ్ర ప్రగతి :**తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు, లంకపల్లి అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూంబిం గ్ చేస్తుండగా.. మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు..

మిగతా 2లో

# రాజధానిగా అమరావతి

(మొదటి పేజి తరువాయి)
ఈ మేరకు ఏపీ రాజధాని అమరావతి అని స్పష్టం చేస్తూ కేబినెట్ తీర్మానించింది. ఈ తీర్మానం కాపీని కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది.సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాల అమలుపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. తీరప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై కూడా మంత్రులు చర్చించారు.ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏపీ పర్యటన సందర్భంగా ప్రధాన వేదికపై సీటింగ్ ఏర్పాట్ల అంశం కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. కేంద్ర మంత్రులను ఒకవైపు, రాష్ట్ర మంత్రులను మరోవైపు కూర్చోబెట్టేలా ప్రోటోకాల్ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. తన పక్కన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.జలవనరుల శాఖ పరిధిలో కంపెనీల చట్టం కింద జల హారతి కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని చెరువులలో పూడికతీత ద్వారా లభించే మట్టిని రైతులు తమ పొలాలకు ఉచితంగా తరలించుకునేందుకు అనుమతిస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అర్బన్ డిజైన్ ప్లానింగ్ సెల్ ఏర్పాటుకు, అలాగే పర్యాటక ప్రాజెక్టులలో ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహకాలు అందించేందుకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది

## ప్రధాని మోదీ ఓ 'అనికేత్': పవన్ కల్యాణ్

**అనికేత్ అంటే ఇల్లు లేని వాడని అర్థమన్న పవన్**

**శివుడికి కూడా అనికేత్ అనేది ఒక పేరు అని చెప్పిన డిప్యూటీ సీఎం**

**ఆపరేషన్ సిందూర్ కు పూర్తి మద్దతు తెలిపిన పవన్**

అమరావతి,**మే 08 ఆంధ్ర ప్రగతి :**



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని, అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. ప్రధాని మోదీని "అనికేత్" అంటూ అభివర్ణిస్తూ, ఆయన నిస్వార్థ సేవానిరతిని కొనియాడారు. అదే సమయంలో, ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలకు, ముఖ్యంగా "ఆపరేషన్ సిందూర్"కు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా పలు కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీని "అనికేత్"గా పేర్కొంటూ పవన్ కళ్యాణ్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. "'అనికేత్' ఒక పేరు, ఒక సంకల్పం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సన్యాస జీవితంలో 'అనికేత్' అని పిలువబడ్డారు. అనికేత్ అంటే 'ఇల్లు లేనివాడు' అని అర్థం" అని వివరించారు. సృష్టికి శాశ్వత సన్యాసి అయిన శివునికి కూడా "అనికేత్" ఒక పేరని గుర్తుచేశారు. "వారికి (శివునికి) విశ్వంలోని ప్రతి కణం ఒక ఇల్లు. అయినప్పటికీ వారికి సొంత ఇల్లు లేదు. నేడు కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, కామాఖ్య నుండి ద్వారక వరకు మొత్తం భారతదేశాన్ని తనదిగా భావించిన అదే 'అనికేత్' (మోదీ), స్వయంగా ఇల్లు లేనప్పటికీ, 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' కింద కోట్లాది మందికి ఇళ్లను అప్పగించారు" అంటూ ప్రశంసించారు.

## విద్యుత్ శాఖపై జగన్ ప్రభుత్వం రూ. 1.25 లక్షల కోట్ల అప్పు : మంత్రి గొట్టిపాటి

అమరావతి,**మే 08 ఆంధ్ర ప్రగతి :**
దేశ భద్రత విషయంలో ప్రజలందరూ ఏకతాటిపై నిలుస్తుంటే, రాష్ట్ర ప్రగతి విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ కు మాత్రం ఆసక్తి ఉండటం లేదని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జగన్ తన సొంత ప్రచార సాధనాల ద్వారా నిరాధారమైన వార్తలను వ్యాప్తి చేస్తున్నారని, అయితే ప్రజలు ఇటువంటి తప్పుడు ప్రచారాలను విశ్వసించరని ఆయన స్పష్టం చేశారు.
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీక్ అవర్స్‌లో యూనిట్ విద్యుత్‌ను రూ. 9.38 చొప్పున కొనుగోలు చేశారని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం అత్యవసర సమయాల్లో కూడా యూనిట్‌ను కేవలం రూ.4.60కే సమకూర్చుకుంటోందని ఆయన వివరించారు. జగన్ ప్రభుత్వం యూనిట్‌ను రూ.5.12కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుందని, అయితే సెకీ నుంచి రూ. 2.49కే కొనుగోలు చేసిందనడంలో వాస్తవం లేదని గొట్టిపాటి పేర్కొన్నారు."రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కుదుర్చుకున్న యాక్సిన్ రెన్యూవబుల్ ఎనర్జీ – బ్రూక్‌ఫీల్డ్ ఒప్పందం ద్వారా ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుంది" అని మంత్రి తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం, యాక్సిన్–బ్రూక్‌ఫీల్డ్ సంస్థ రైతుల నుంచి 1,700 ఎకరాల భూమిని లీజుకు తీసుకుంటుందని, ఎకరాకు రూ. 31 వేల చొప్పున లీజు చెల్లించేలా అంగీకారం కుదిరిందని ఆయన వెల్లడించారు. ప్రతి రెండేళ్లకు లీజు మొత్తాన్ని 5 శాతం పెంచేలా కూడా ఒప్పందంలో పొందుపరిచారని గొట్టిపాటి వివరించారు.గత జగన్ ప్రభుత్వం విద్యుత్ శాఖను రూ.1.25 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచిందని మంత్రి ఆరోపించారు. ఆ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలు ఇప్పటికీ మోయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే భర్త, వైసీపీ నేత హత్య కేసులో సంచలన తీర్పు..**

## 11 మందికి యావజ్జీవ కారాగారశిక్ష

కర్నూలు **మే 08 ఆంధ్ర ప్రగతి :**



కర్నూలు జిల్లా వైసీపీ నేత పత్తికొండ మాజీ ఇన్‌ఛార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. మొత్తం 16 మంది నిందితుల్లో 11 మంది నిందితులకు యావజ్జీవ శిక్ష విధించింది. ఐదుగురిని నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి భర్త దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం.. గురువారం 11 మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కర్నూలు జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. బాధితుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మద్దికుంట వెంకటరెడ్డి వాదనలు వినిపించారు.మరోవైపు కర్నూలు జిల్లా కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు పట్ల దివంగత నారాయణరెడ్డి భార్య పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పందించారు. కోర్టు తీర్పుతో న్యాయస్థానాల పట్ల మరింత నమ్మకం పెరిగిందని చెప్పారు. కోర్టు ఇచ్చిన ఈ సంచలన తీర్పుతోనైనా తనలాంటి మరో మహిళకు అన్యాయం జరగకూడదని భావిస్తున్నట్లు తెలిపారు...

## ముగ్గురు పోలీసుల మృతి!

**(మొదటి పేజి తరువాయి)**మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన సందీప్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన పవన్‌కల్యాణ్, కామారెడ్డి జిల్లా పాల్వంచకు చెందిన శ్రీధర్ అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఆర్ఎస్సై రణధీర్‌కు బుల్లెట్ గాయమైనట్టు తెలిసింది. పోలీసుల మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగుకు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.గాయపడ్డ ఎస్సైను హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. కానిస్టేబుళ్ల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం గురువారం సాయంత్రం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు తరలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. మరణించిన కమాండోల కుటుంబాలకు అండగా ఉంటామని డీజీపీ ప్రకటించారు. కాగా మందుపాతరపేలిన తర్వాత మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని, 8మంది మావోయిస్టులు మృతిచెందారని.. వీరిలో మావోయిస్టుపార్టీ అగ్రనేతలు చంద్రన్న, బండిప్రకాశ్ ఉన్నట్టు ప్రచారం జరిగింది. దీన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. బండి ప్రకాశ్(60) అలియాస్ క్రాంతి అలియాస్ ప్రభాత్‌ది మంచిర్యాల జిల్లా మందమర్రి.

# ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం

(మొదటి పేజి తరువాయి)
ఇది రాష్ట్రంతో పాటు– దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుందని లోకేశ్ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ– యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు– స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నామని లోకేశ్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇగురువారం పర్యటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు.




రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు– చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ– ఏర్పడనుందని లోకేశ్ అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ– పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు–కు అన్ని రకాలుగా తోడ్పాటు– అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు– చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. శుక్రవారం సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేట–కి మరో మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరుకాలేదు. ఈ మేరకు మంత్రులు ముందస్తు అనుమతి పొందారు.

# రాసిపెట్టుకోండి మామూలుగా ఉండదు

**మరోసారి జగన్ వార్నింగ్**

(మొదటి పేజి తరువాయి)
వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, అలాంటి పోలీసు అధికారుల పేర్లు రాసుకోవాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని, 'జగన్ 2.0'లో వారికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.
వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలానికి చెందిన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో పాటు ఆయా జిల్లాల ముఖ్య నేతలతో జగన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... కేవలం వైసీపీని ప్రేమించినందుకు, అభిమానించినందుకు కార్యకర్తలు అనేక బాధలు పడుతున్నారని, వారి ఆవేదనను తాను చూస్తున్నానని అన్నారు. "మీ బాధలు చూస్తున్నాను. హామీ ఇస్తున్నాను. ఎవ్వరినీ వదలం. ఎక్కడున్నా సరే, కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి. అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడదాం" అని జగన్ స్పష్టం చేశారు.
ప్రస్తుతం చంద్రబాబు, కొందరు పోలీసులు దుర్మార్గాలకు పాల్పడుతున్నారని, వారు ఏదైతే విత్తనం వేస్తున్నారో, రేపు అదే మొలకెత్తుతుందని జగన్ వ్యాఖ్యానించారు. "ఈరోజు దౌర్జన్యాలు చేస్తున్న అధికారులు, పోలీసులు ఆనాడు ఎక్కడున్నా, రిటైరైనా, సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అది మామూలుగా ఉండదు" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని, ప్రశ్నించకూడదనే ఉద్దేశంతో తప్పుడు కేసులు పెడుతున్నారని, తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారని జగన్ ఆరోపించారు. సంబంధం లేని వారిని కూడా కేసుల్లో ఇరికిస్తున్నారని, గతంలో ఇటువంటి రాజకీయాలు ఎప్పుడూ చూడలేదని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు ప్రజల్లో చులకన అయ్యారని, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని జగన్ విమర్శించారు. ఈ వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే, ఎవరూ ప్రశ్నించకుండా ఉండేందుకు రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.
ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ప్రజల్లో వ్యతిరేకత కనిపించినా వెంటనే ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని, ఒకరోజు తిరుపతి లడ్డూ వివాదం, మరోరోజు సినీ నటి కేసు అంటూ ప్రజల దృష్టిని పక్కదారి పట్టిస్తున్నారని జగన్ ఆరోపించారు. ప్రజల్లోకి వెళ్లే ధైర్యం టీడీపీ వారికి లేదని, ప్రజలు అడిగే ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారని అన్నారు.
ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడంతో, పిల్లలు తమ రూ.15 వేలు, రైతులు రూ.26 వేలు, అవ్వలు రూ.48 వేలు, యువత రూ.36 వేలు ఏమయ్యాయని నిలదీస్తున్నారని, దీనికి సమాధానం చెప్పలేని దుస్థితిలో టీడీపీ ఉందని జగన్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను చంద్రబాబు ప్రభుత్వం నాశనం చేసి, నిర్వీర్యం చేసిందని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# కేంద్రం చర్యలకు ఏకగ్రీవంగా మద్దతు

న్యూఢిల్లీ,,**మే 08 ఆంధ్ర ప్రగతి :**
ఆపరేషన్ సిందూర్ గురించి అన్ని రాజకీయ పార్టీలకు వివరించడానికి కేంద్రం గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. ఉదయం 11 గంటలకు రాజ్‌నాథ్ అధ్యక్షతన అన్ని పార్టీల నేతలు సమావేశం అయ్యారు. ఈ సమావేశం రెండు గంటల పాటు సాగింది.ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, జై శంకర్, కిరణ్ రిజిజు సహా పలువురు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్ నుంచి సందీప్ బందోపాధ్యాయ, డీఎంకేకు చెందిన టీఆర్ బాలు సమావేశంలో పాల్గొన్నారు.
ఇతర ప్రతిపక్ష నాయకులలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్ గోపాల్ యాదవ్, ఆప్‌కు చెందిన సంజయ్ సింగ్, శివసేన (యూబీటీ)కి చెందిన సంజయ్ రౌత్, ఎన్సీపీ (ఎస్పీ)కి చెందిన సుప్రియా సులే, బీజేడీకి చెందిన సస్మిత్ పాత్రా, సీపీఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ ఉన్నారు. ఈ సమావేశంలో పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వివరాలను రక్షణ మంత్రి పంచుకున్నారు.

**తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాం**

ఈ సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ మాట్లాడుతూ, త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వివరాలను వివరించారు. ముందుగా నిర్దేశించిన తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై మన దళాలు మెరుపు దాడి చేశాయన్నారు.. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లలోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను భారత సైన్యం నేలమట్టం చేసిందన్నారు. పక్కా సమాచారంతో, అత్యంత కచ్చితత్వంతో ఉగ్రవాద స్థావరాలపై దాడి చేశామన్నారు. పాక్ మిలటరీ స్థావరాల జోలికి వెళ్లలేదని తెలిపారు. సైనిక శిబిరాలపై దాడి చేస్తే యుద్ధానికి దారితీస్తుందనే ఉద్దేశంతో కేవలం ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని మెరుపుదాడులు జరిపినట్లు వివరించారు రాజ్ నాథ్. ఈ ఆపరేషన్ మొత్తం భారత సరిహద్దుల నుంచే నిర్వహించినట్లు తెలిపాయి.
భారత సైన్యం ఈ ఆపరేషన్‌ను భారత గగనతలం నుంచే నిర్వహించిందని , పాక్ భూభాగంలో అడుగుపెట్టలేదని చెప్పారు. సరిహద్దు నుంచి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నాయి. ఇందుకోసం రాఫెల్ యుద్ధ విమానాలతో పాటు స్కాల్ఫ్ క్రూయిజ్ మిసైల్స్, ఖచ్చితత్వంతో కూడిన గైడెడ్ బాంబులు, హరోప్ కామికేజ్ డ్రోన్‌ల వంటి అధునాతన ఆయుధాలను ఉపయోగించినట్లు వివరించారు. వాటితో ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా నేలమట్టం చేసినట్లు వెల్లడించారు. .

**100 మందికి పైగా హతం**

ఆధునిక యుద్ధ విమానాలు క్షిపణులు ప్రయోగించి తొమ్మిది కీలక ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేశామన్నారు.. ఇప్పటి వరకు అందిన సమాచారం 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారని, రెండు వందల మందికి పైగా గాయపడ్డారని తెలిపారు.. కేవలం తమ దాడులు ఉగ్రవాద క్యాంపులకే పరిమితం చేశామన్నారు.. పాక్ ఆర్మీ పోస్ట్ లకు గాని, సామాన్య ప్రజలకు గాని ఎటువంటి నష్టం కలుగకుండా మన దళాలలు తమకు అప్పగించిన పనిని దిగ్విజయంగా పూర్తి చేశాయన్నారు.. ఈ దాడులకు సంబందించిన వీడియోలను, ఫోటోలను ఈ సమావేశంలో ప్రదర్శించారు. కాగా, ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న త్రివిద దళాలకు అఖిలపక్ష నేతలు అభినందనలు తెలిపారు.

# దాడులు ప్రతిదాడులు

న్యూఢిల్లీ,,**మే 08 ఆంధ్ర ప్రగతి :**
చైనాకు చెందిన హెచ్‌క్యూ–9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు– విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మోర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు–, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు– పాకిస్థాన్ ప్రకటించింది.
పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక దాడుల్లో కేవలం ఉగ్రవాదులను మాత్రమే హతమార్చినట్లు– విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పౌరులు చనిపోయారన్న పాకిస్థాన్ ఆరోపణలను ఆయన ఖండించారు. భారత సైనిక దాడుల్లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు హాజరైన చిత్రాన్ని విక్రమ్ మిస్రీ ప్రదర్శించారు. శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి ప్రభుత్వ లాంఛనాలతో పౌరులకు అంత్యక్రియలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. మే 7న భారత్ జరిపిన సైనిక దాడులన్నీ జాగ్రత్తగా ఎంచుకున్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాద లక్ష్యాలపైనే అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. 'ఈ దాడుల్లో ఎవరైనా పౌరులు చనిపోతే, ఈ చిత్రం మీ అందరికీ ఎలాంటి సందేశాన్ని పంపుతుందో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది అడగాల్సిన ప్రశ్న. పౌరుల అంత్యక్రియల్లో శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి, ప్రభుత్వ గౌరవం ఇవ్వడం కూడా వింతగా ఉంది. హతమైన వ్యక్తులు ఉగ్రవాదులే. అలాంటి ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు బహుశా పాకిస్థాన్‌లో ఒక ఆచారం కావచ్చు. ఇది మాకు పెద్దగా అర్థం కాలేదు' అని అన్నారు. అలాగే మతపరమైన ప్రదేశాలపై భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్ ఆరోపణలను కూడా విక్రమ్ మిస్రి ఖండించారు. ఇది పూర్తిగా అబద్ధమని అన్నారు. కేవలం ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు సాగాయని అన్నారు. ఇకపోతే పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టామన్నారు. ఈ పాక్ సైన్యం కాల్పుల్లో 16 మంది మృతి చెందినట్లు తెలిపారు. పహల్గామ్ దాడులకు పాల్పడింది తామేనని ఆర్‌టిఎ ప్రకటించిందని, అది లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ అని తెలిపారు. అయితే, అంతర్జాతీయ సమాజానికి పాక్ తప్పుడు సమాచారం ఇస్తోందన్నారు. ఉగ్రవాదులతో తమక సంబంధాలు లేవని పాక్ బుకాయిస్తోందన్నారు. పాక్‌లో టెర్రరిస్టులు లేరని ఆ దేశ మంత్రి నిస్సిగ్గుగా చెబుతున్నారని.. అనేక దాడుల్లో పాక్ ప్రమేయం ఉందని చాలా సార్లు రుజువైందని వివరించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదే పాకిస్తాన్ అన్నారు. ముంబై సహా భారత్ లో జరిగిన పలు దాడులపై పాక్ హస్తం ఉందన్నారు. ఉగ్రవాదుల డిఎన్ఎ రికార్డులు, వారి అడ్రస్సులు పాక్‌కు అందించామని.. కానీ పాకిస్తాన్ ఏ అంశంలోనూ స్పందించేదని పేర్కొన్నారు.

# మద్యం స్కామ్ కేసులో నిందితులకు షాక్

## ధనుంజయ్ రెడ్డి తదితరకుల బెయిల్ తిరస్కరణ -విచారణ ఈ నెల 13కు వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ,,**మే 08 ఆంధ్ర ప్రగతి :**
ఏపీ లిక్కర్ స్కాంలో నిందితులకు సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసులో నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ ముగ్గరికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. ఈ కేసులో వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ నిందితులు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ ముగ్గరికి మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. ఈ కేసు మొదలైనప్పుడే ఈ ముగ్గురు కూడా ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు వచ్చారు. అయితే దీనికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. అక్కడ న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఇక్కడకు రావాలని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ పార్థివాలా, జస్టిస్ మహాదేవన్‌తో



కూడిన ధర్మాసనం ఆదేశాలు చేసింది. ఈ క్రమంలో బుధవారం ఈ ముగ్గురు నిందితులు వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణకు వచ్చింది. కానీ వీరికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. దాంతో ఈరోజు సుప్రీం కోర్టు ముందుకు వచ్చిన ముగ్గురు నిందితులు.. హైకోర్టు నిరాకరించినందుకు తమకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని వినతి చేశారు. ఏపీ హైకోర్టులో వీరికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించినందున.. హైకోర్టులో పెండింగ్‌లో ఉండగానే సుప్రీంలో దాఖలైన ఈ పిటిషన్ నిరర్ధకమైందని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో గతంలో వేసిన పిటిషన్‌ను సవరణ అయినా చేయాలి లేదా కొత్త పిటిషన్ అన్నా దాఖలు చేయాలని.. అంతవరకు దీనిని అనుమతించవద్దని ముకుల్ రోహత్గీ చెప్పారు. రోహత్గీ వాదనలతో ఏకభవించిన కోర్టు.. గతంలో వేసిన పిటిషన్‌ను సవరించి మరో పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. అయితే 13 వరకు తమను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని ముగ్గరి తరపున వాదించిన న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. కానీ మధ్యంతర రక్షణ కల్పించేందుకు కూడా సుప్రీం కోర్టు నిరాకరించింది. అప్పటి వరకు మిమ్మల్ని మీరే కాపాడుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. మధ్యంతర బెయిల్‌పై మళ్లీ పిటిషన్ దాఖలు చేసిన తర్వాత 13వ తేదీన సుప్రీం కోర్టు విచారణ జరిపి మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# 11నుంచి పాడేరు మోదకొండమ్మ జాతర

## సిఎం చంద్రబాబకు ఆహ్వాన పత్రిక అందచేత

## వివరాలు వెల్లడించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అమరావతి, **మే 08 ఆంధ్ర ప్రగతి :**
ఆంధ్రప్రదేశ్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా పాడేరులోని మోద కొండమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తామని మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం అమరావతిలో వెల్లడించారు. మే 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులపాటు- ఈ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. మరోవైపు.. ఈ జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు



గురువారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆహ్వాన పత్రిక అందిజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని గిరిజనుల కొంగు బంగారంగా పూజలందుకునే ఈ అమ్మ వారి జాతరను ఏపీ ప్రభుత్వ పండుగగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సారి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు- ఆమె వివరించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ ఇచ్చి మూడు రోజులపాటు- ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. గిరిజన సాంప్రదాయ వంటలు అన్నం, పప్పు, బూరెలు, అరిసెలు, అట్లు- నైవేద్యంగా సమర్పిస్తామని చెప్పారు. తెలంగాణాలో సమ్మక్క, సారలమ్మ తరహాలోని ఆంధ్రప్రదేశ్‌లోనూ మోదకొండమ్మ అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్లు- తెలిపారు. దేవాలయం ఒకచోట, అమ్మవారి పాదాలు మరోక చోట ఉండడం ఈ గిరిజన జాతర ప్రత్యేకతలన్నారు. పాడేరు గ్రామ పొలిమేరల్లో అమ్మవారి పాదాలకు పూజ చేశాక జాతరకు రావడం అనవాయితీగా వస్తుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి వివరించారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక అమ్మవారి జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ జాతరకు ఒడిశాతోపాటు- ఏపీ నలుమూలల నుంచి దాదాపు 5 లక్షల మంది గిరిజనులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు- చెప్పారు.

# ఇద్దరు ఐపీఎస్‌లకు హైకోర్టులో బిగ్ రిలీఫ్

అమరావతి, **మే 08 ఆంధ్ర ప్రగతి :**ఏపీలో సంచలనం సృష్టించి ముంబై నటి జెత్వాని కేసులో ఇద్దరు ఐపీఎస్ అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. నటి జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో ఐపీఎస్ అధికారులు విశాల్ గున్ని, క్రాంతి రానా తాతా, పోలీసు అధికారులు ఏసీపీ హనుమంతరావు, సత్యనారాయలపై తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే క్వాష్ పిటిషన్లపై తుది విచారణను జూన్ 30కు హైకోర్టు వాయిదా వేసింది.

# భారత్‌లో స్టార్‌లింక్ సేవలు.. కీలక ముందడుగు

**ఎలాన్ మస్క్ స్టార్‌లింక్‌కు భారత టెలికం శాఖ నుంచి 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'**

**జాతీయ భద్రతా మార్గదర్శకాలకు స్టార్‌లింక్ అంగీకారం**

**ఇన్-స్పేస్ అనుమతి, స్పెక్ట్రమ్ కేటాయింపు తదుపరి దశలు**

**భారత మంత్రులతో స్టార్‌లింక్ ఉన్నతాధికారుల చర్చలు**

**దేశీయ టెల్కోల నుంచి స్టార్‌లింక్‌తో భాగస్వామ్యానికి ఆసక్తి**




**మే 08 ఆంధ్ర ప్రగతి :**
టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్ భారతదేశంలో తన కార్యకలాపాలు ప్రారంభించే దిశగా కీలక ముందడుగు వేసింది. కేంద్ర టెలికం విభాగం నుంచి 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' అందుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీంతో దేశంలో చౌక ధరలకే వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు మరింత మెరుగయ్యాయి.
శాటిలైట్ కమ్యూనికేషన్ ఆపరేటర్ల కోసం నిర్దేశించిన నూతన జాతీయ భద్రతా మార్గదర్శకాలకు కట్టుబడి ఉంటామని స్టార్‌లింక్ అంగీకరించడంతో ఈ ప్రాథమిక అనుమతి లభించినట్లు తెలుస్తోంది. తప్పనిసరి ఇంటర్‌సెప్షన్, పర్యవేక్షణ వ్యవస్థలు, స్థానిక డేటా సెంటర్ల వినియోగం, మొబైల్ యూజర్ టెర్మినల్స్ లొకేషన్ ట్రాకింగ్, స్థానికీకరణ ఆదేశాలతో సహా పలు కీలక నిబంధనలను టెలికం శాఖ ఇటీవల ప్రకటించింది.
ప్రస్తుతం స్టార్‌లింక్ ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ నుంచి అనుమతి పొందాల్సి ఉంది. ఇందుకు అవసరమైన పత్రాలను ఇప్పటికే సమర్పించినట్లు సమాచారం. ఇన్-స్పేస్ ఆమోదం లభించిన తర్వాత స్పెక్ట్రమ్ కేటాయింపు ప్రక్రియ మొదలవుతుంది.
గత నెలలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, స్టార్‌లింక్ ఉపాధ్యక్షుడు చాడ్ గిబ్స్, సీనియర్ డైరెక్టర్ ర్యాన్ గుడ్‌నైట్‌లతో కూడిన ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. "స్టార్‌లింక్ అత్యాధునిక సాంకేతిక వేదిక, వారి ప్రస్తుత భాగస్వామ్యాలు, భారతదేశంలో భవిష్యత్ పెట్టుబడి ప్రణాళికలపై చర్చలు జరిగాయి" అని గోయల్ ఈ సమావేశం అనంతరం 'ఎక్స్' లో పేర్కొన్నారు.
దేశీయ టెలికాం దిగ్గజాలైన ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి సంస్థలు కూడా భారతదేశంలో శాటిలైట్ టెలికం సేవల ప్రారంభానికి స్టార్‌లింక్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో శాటిలైట్ ఇంటర్నెట్ అవసరం ఎంతగానో ఉందని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా గతంలో అభిప్రాయపడ్డారు.
మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ స్టార్‌లింక్‌ను నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలను అందించడమే స్టార్‌లింక్ లక్ష్యం. ఈ పరిణామాలతో త్వరలోనే భారత వినియోగదారులకు స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించవచ్చు.

# పుట్టిన పాపకు సిందూర్ నామకరణం

## బీహార్‌లో ఓ కుటుంబం నిర్ణయం

పాట్నా,**మే 08 ఆంధ్ర ప్రగతి :**
బిహార్‌లో ఆసక్తికర సంఘటన చోటు- చేసుకుంది. కాతిహార్ జిల్లాలోని కుందన్ కుమార్ మండల్ తన కుమార్తెకు సిందూర్ అని పేరు పెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా దాయాది దేశం పాకిస్థాన్‌పై కేంద్రం సిందూర్ పేరుతో సైనిక చర్యకు



పాల్పడిన రోజు.. తమకు పాప జన్మించిందని ఆయన వివరించారు. అందుకే తమ పాపకు సిందూర్ అనే పేరు పెట్టినట్లు- తెలిపారు. ఈ పాపకు సిందూర్ అంటే అర్థం ఇప్పుడే తెలియక పోవచ్చు. కానీ ఆమె పెరిగి పెద్దదైన తర్వాత ఆ పేరుకు అర్థం తెలుసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అమాయకుల ప్రాణాలను తీయడం ద్వారా దేశానికి హాని కలిగించే పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల పీచమణచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ చర్య చేపట్టడం తమకు గర్వంగా ఉందన్నారు. పాపకు ఈ పేరు పెట్టడం పట్ల తమ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేసుకున్నారు. మరోవైపు పాపకు సిందూర్ పేరును ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది సైతం ఆమోదించారని చెప్పారు. మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రమూకల స్థావరాలపై భీకర దాడులు జరిపింది. ఈ దాడుల్లో దాదాపు 100 మంది మరణించినట్లు- భారత్ ప్రకటించింది. భారత్ చేపట్టిన ఈ చర్యకు సిందూర్ అని కేంద్రం నామకరణం చేసింది. అదే రోజు.. కుందన్ కుమార్ మండల్‌కు కుమార్తె జన్మించడంతో ఆమెకు ఈ పేరును పెట్టారు.

# పివోకె స్వాధీనంతో పాక్‌కు బుద్ది చెప్పాలి !

అమరావతి, **మే 08 ఆంధ్ర ప్రగతి :**
ఒక్క ఆపరేషన్ సిందూర్‌తో పాక్ దుష్టబుద్ధిని అణచివేయలేం. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న తీరును దారికి తేలేము. దాని వక్రబుద్దిని మార్చలేము. భారత్‌తో పెట్టుకుంటే ఇక జీవితం లేదన్న రీతిలో తగిన బుద్ది చెప్పాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను సంపూర్ణంగా శాశ్వతంగా సాధించాలి. ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలి. జీవితంలో మళ్లీ కోలుకోలేని విధంగా బుద్ది చెప్పాలి. ఇది అంత సులవయిన పని కాకున్నా ఇందుకు మనం కొంత త్యాగం చేయక తప్పదు. పివోకెపుశాశ్వతంగా స్వాధీనం చేసుకుంటే తప్ప పాక్‌ను కట్టడి చేయలేమని మోడీ గుర్తించాలి. మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు నోరు మూసుకుంటే మంచిది. పహల్గామ్ దాడి తరవాత ఆయన చేసిన వ్యాఖ్యలు క్షంతవ్యం కాదు. ఇకపోతే పాక్ను దారికి తేవాలంటే శాశ్వతంగా దాని మెడలు వంచాల్సిన అవసరం ఉంది. అది ఎప్పుడో జరగాల్సి ఉన్నా..నెహ్రూ, ఇందిరల నిర్వాకం వల్ల భారత్ ఎంతో మూల్యం చెల్లించుకుంది. నెహ్రూను ప్రధానిని చేయడం లక్ష్యంగా గాంధీ అనుసరించిన విధానం కారణంగా జిన్నా పాక్ ఏర్పాటును బలంగా తీసుకుని వెళ్లారు. ఆంగ్ల పాలకులుకూడా ఇదే అదనుగా దేశాన్ని అడ్డంగా విభజించి గీతలు గీసారు. దీనిని ఆనాటి నాయకులు ఏ రకంగానూ వ్యతిరేకించలేదు. దేశ విభజన ఓ చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. విభజన సందర్భంగా వేల్లలో ముస్లింలు పాక్ వైపు వెళితే..లక్షల్లో హిందువుల శవాలు భారత్‌కు తరలించారు. ఆనాటి ఊచకోత గురించి ఎంత




చెప్పుకున్నా తక్కువే. ఇలా ఊచకోతలు, బలవంతపు మతమార్పిళ్లతో ఇస్లామిక్ రాజ్యంగా అవతరించిన పాక్ ఆదినుంచీ భారత్ వ్యతిరకతను నరనరాన జీర్ణించుకుంది. కాశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించింది. దానిని పరిష్కరించలేక పోయిన నెహ్రూ 370 ఆర్టికల్‌తో కొత్త సమస్యలు తెచ్చి పెట్టారు. ఈ సమస్యను పరిష్కరించడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని నాటి కాంగ్రెస్ పాలకులు జారవిడుచుకున్నారు. ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీన పర్చుకుంటే తప్ప పాక్ కోరలు పీకలేం. ప్రస్తుత పరిస్థితుల్లో యుద్దమంటూ జరిగితే ..అది పివోకెను ఆక్రమించుకునేదిగా మాత్రమే ఉండాలి. కశ్మీర్‌తో భారత్‌కు పురాతన కాలం నుంచీ ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలిసినా పాకిస్తాన్ పాలకులు తమ మనుగడకోసం, రాజకీయాలకోసం మతాన్ని, కశ్మీర్‌ను ఉపయోగించుకుంటూనే ఉన్నారు. అంతర్జాతీయంగా యాగీ చేస్తున్నారు. పివోకెలో ఉగ్రశిబిరాలను ఏర్పాటు చేసి దాడులకు ఉసిగొల్పుతున్నారు. చివరకు ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవాదకలు పాక్ సైనికులు సలాం కొట్టారు. భారతదేశాన్ని శత్రువుగా, ముస్లింల వ్యతిరేకిగా చిత్రిస్తూ పబ్బం గడుపు కోవడమే పనిగా పెట్టుకుని ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌కు గర్వహంగా చేయాలి. దాని ఉనికిని సవాల్ చేయాలి. కుంటూనే ఉన్నారు. భారత్ నుంచి విడిపోయి పాక్‌గా ఏర్పడ్డ పాక్... భారతదేశం తమకు శత్రువని పదేపదే రుజువు చేసుకుంటోంది. పాక్ సైనికాధికారులు ఎప్పుడూ భారత వ్యతిరేకతను నూరిపోస్తున్నారు. తాజాగా ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. భారత వ్యతిరేకతే జాతీయ వాదంగా ప్రజల్ని ప్రభావితం చేసేందుకు పాక్ ప్రభుత్వాలు, సైన్యం, ఇంటలిజెన్స్ సంస్థలూ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ప్రమాదకర ఉగ్రవాద శక్తుల్ని పోషిస్తున్నాయి. కాశ్మీర్‌పై అక్కసు వెళ్లగక్కు తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో పదేపదే ప్రస్తావించి భంగపడ్డా పాక్‌కు బుద్ధ ఇరావడం లేదు. 1971లో జరిగిన యుద్ధంతో బంగ్లాదేశ్ ఆవిర్భావం జరిగినా...పాక్ వంకర బుద్దిని మార్చుకోలేదు. 1999లో కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడి దెబ్బతిన్నా పాకిస్థాన్ పాలకుల మనస్తత్వం మారడంలేదు. ఉగ్రవావాలను పెంచి పోషించడంతో పాటు అబోటాబాద్‌లో లాడెన్‌కు ఆశ్రయమిచ్చి దాచి పెట్టాయి. అమెరికన్ దళాలు ఒసామాబిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత కూడా పాక్ సైన్యం బుద్ది మారడం లేదు. పొరుగుదేశాల్లో హింసాత్మక చర్యలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ తన అంతర్గత భద్రతకే ముప్పు తెచ్చుకుం టుందని తెలిసి కూడా కుక్కతోక వంకరలా బుద్ది మార్చుకోవడం లేదు. పాక్ బడ్జెట్‌లో 30శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆసియాలోనే అత్యంత ఎక్కువ స్థాయిలో పెరుగుతున్న జనాభాలో దాదాపు 41 శాతం పేదరికంలో మగ్గుతున్నా ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుని భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానకోవడం లేదు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఊచకోతకు దారితీసింది. హిందువులను పేరుపెట్టి క్రూరంగా చంపిన ఘటనకు పాక్‌ను ఎంతగా ధ్వంసం చేసినా తక్కువే. అందుకే ఇప్పుడు సిందూర్‌తోనే మన దాడి ఆగకూడదు. ఇలాంటి దాడులు కొనసాగాలి. మనం కొంత నష్టపోయినా శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలి. భారత్‌లో జోక్యం చేసుకోకుండా, ఉగ్రవాదులను ప్రోత్సహించ కుండా కట్టడి చేయాలి. ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీసి అడుక్కుతినేలా చేయాలి. ఎందుకంటే ఒక్క పాక్ వల్లనే భారత్ ఎంతగానో నష్టపోయింది. పహల్గాం ఉగ్రదాడి ఉచ్చు తమచుట్టూ బిగుస్తోందని, భారత్ నుంచి ప్రతీకార దాడి తప్పదని లోలోపల పాక్ బెంబేలెత్తుతున్నా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శి స్తోంది. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ప్రేలాపనలు చేస్తూనే ఉన్నాడు. పాక్ సార్వభౌమాధి కారానికి, ప్రాదేశిక సమగ్రతకు ముప్పు తలెత్తినట్లయితే పాకిస్థాన్ పూర్తి సైనిక సత్తా చాటుతుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి వారికి గట్టి బుద్ది చెప్పాలి. సిందూర్ ఆపరేషన్ అంతంకాదు..ఆరంభమని ఆర్మీ మాజీ చీఫ్ నరవాణె చేసిన వ్యాఖ్యలు నిజం కావాలి.

# మే 13 వ తేదీ నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు.

**-11 సంవత్సరంలోపు బాల బాలికలకు ప్రత్యేక విభాగాలలో.**


**-రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**



ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల కు శ్రీ రామకృష్ణ విద్యాలయ ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్లో జిల్లా స్థాయి 11 సంవత్సరముల లోపు బాల బాలికలకు వేరు వేరు విభాగాలలో చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్.రవికృష్ణ,కార్యదర్శి రామసుబ్బారెడ్డి,ఎస్వీ డిగ్రీ కళాశాల,సి.ఎం.ఎస్.జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ముని శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 12వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్ సైట్ లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని,నంద్యాల జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25వ తేదీల్లో గుంటూరులో జరగబోవు రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో పాల్గొంటారని తెలిపారు.
ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ 9010451585.ద

# యాదగిరి నరసింహస్వామి దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి



**ఆంధ్ర ప్రగతి గోస్పాడు మే 08:**నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం తెల్లపురి గ్రామంలో శ్రీ యాదగిరి నరసింహస్వామి జీర్ణోదరణ మరియు సంప్రోక్షణ నూతన విగ్రహ గణపతి శివలింగ ఆంజనేయ ధ్వజ స్థిర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు అదేవిధంగా గ్రామాలలో రైతులు సుభిక్షంగా ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పి పి మధుసూదన్ రెడ్డి, నారాయణ, రామ సుబ్బారెడ్డి, లోకేష్ బాబు, అన్నయ్య, మరియు గ్రామ వైసిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ ను ఆవిష్కరించిన ఎన్ఎండి ఫయాజ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**




ఈనెల 15వ తేదీన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ పుట్టినరోజు సందర్భంగా నంద్యాల 33 వ వార్డు టిడిపి ఇంచార్జ్ జోసఫ్ మరియు సాయి , మధు , ధనరాజ్ , చాంద్ ఆధ్వర్యంలో 9 వ తేదీ నుండి స్థానిక ఎస్ పి జి గ్రౌండ్ నందు ఎస్.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని దానికి సంబంధించిన బ్రోచర్ ను నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ఎస్.పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో మొదటి బహుమతి 60వేలు, రెండవ బహుమతి 40 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఎంట్రీ ఫీజు 1000 రూపాయలు , బాల్ ఫీజు 100 చెల్లించవలసి ఉంటుందన్నారు . అలాగే ఆసక్తి ఉన్నవారు 8వ తేదీ సాయంత్రం లోపు తమ టీం పేర్లను 8919507340 , 9701159958 కి ఫోన్ చేసి నమోదు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.

# మూడో దశ టెలిమెట్రీకి ఒప్పుకోం!

## కృష్ణా బోర్డుకి తేల్చిచెప్పిన ఏపీ ప్రభుత్వం



హైదరాబాద్, **మే 08 ఆంధ్ర ప్రగతి :**కృష్ణా జలాల తరలింపుపై లెక్కలు తీయడానికి వీలుగా అదనపు టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ప్రతిపాదనలను అంగీకరించబోమని ఏపీ తేల్చి చెప్పింది. ఈ మేరకు ఏపీ నీటిపారుదల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గత మార్చి 10వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి లేఖ రాశారు. దీనిపై అభిప్రాయం తెలుపాలంటూ ఈ నెల 6న కృష్ణా బోర్డు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాసింది.ఈ నేపథ్యంలో, ఏపీ లేఖలోని వివరాలు వెల్లడయ్యాయి. కృష్ణా జలాల తరలింపునకు సంబంధించి ఏపీ పరిధిలోని 11 కాంపోనెంట్లపై.. మూడో విడత కింద అదనపు టెలీమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేఆర్ఎంబీని తెలంగాణ గతంలో కోరింది.

# ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.

**-ఏఐటియుసి సిఐటియు ఐఎఫ్టియు కార్మిక సంఘాలు పిలుపు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**




నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కనీస వేతనం 26,000 రూపాయలు ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ ఆపాలి. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దు చేయాలి. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మిక సంఘాల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి శంకర్లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సమ్మె జయప్రదం కోసం ఈనెల నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని అలాగే 16 17 తేదీల్లో స్కూటర్ ఆటో ర్యాలీలు పాదయాత్రలు 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం కోసం నంద్యాల జిల్లాలో అన్ని మండల నియోజకవర్గ కేంద్రాల్లో కార్మిక ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ఉద్యోగులు విధులు బహిష్కరించి భారీగా ప్రదర్శనలు సమ్మెను ఉధృతంగా తమ హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దాగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘ నాయకులు రంజిత్ శివరాముడు మస్తాన్ ఈశ్వరమ్మ సుబ్బమ్మ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం అనుబంధ సంఘ నాయకులు గౌస్ మద్దులు ఐఎఫ్టియు నాయకులు చౌడప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.


# గవర్నర్ అవార్డు ను పొందిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 08:**



రెడ్ క్రాస్ అభివృద్ధికి విశేష సేవలు అందించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గవర్నర్ అవార్డును పొందారు. గురువారం అమరావతిలోని రాజ్ భవన్ లో జరిగిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మరియు ప్రపంచ తలసేమియా దినోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎస్. అబ్దుల్ నజీర్ మరియు ప్రథమ మహిళ శ్రీమతి సమీరా నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గవర్నర్ అవార్డు, గోల్డ్ మెడల్ ను స్వీకరించారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ ఉద్యమానికి అత్యుత్తమ సేవలు అందించడంతోపాటు మరియు గరిష్ట సహకారాన్ని సమీకరించినందుకు 8 మంది కలెక్టర్లకు గవర్నర్ పతకాలను అందజేశారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో రెడ్ క్రాస్ అభివృద్ధికి విశేష సేవలు అందించిన నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి కి ప్రతిష్టాత్మకమైన అవార్డును మరియు గోల్డ్ మెడల్ ను గవర్నర్ గారి చేతులు మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఇటీవల అధునాతన వసతులతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను ప్రారంభించుకున్నామన్నారు. అలాగే రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రజలకు అత్యంత తక్కువ ధరలకు లభ్యమయ్యేలా జనరిక్ మెడికల్ షాప్ ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యూత్ బ్లడ్ క్రాస్ ను బలోపేతం చేసి అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా రెడ్ క్రాస్ ఆర్మీనీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తయారు చేస్తామన్నారు. మత్స్యకారులకు, చెంచు కుటుంబాలకు కూడా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా మరిన్ని వైద్య సేవలు ఇంటింటికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వై డి రామారావు, కోశాధికారి రామచంద్ర రాజు, జనరల్ సెక్రెటరీ ఏకే ఫరీదా ఐఏఎస్ , నంద్యాల చైర్మన్ దస్తగిరి పర్ల తదితరులు పాల్గొన్నారు.
అనంతరం శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ లో రెడ్ క్రాస్ తలసేమియా బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ సెంటర్ ను గవర్నర్ రాజ్ భవన్ నుండి వర్చువల్ మోడ్ లో ప్రారంభించారు.

# సంజీవనగర్ రామాలయంలో మహా కుంభాభిషేకం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**

నంద్యాల పట్టణం సంజీవ్ నగర్ లో వెలసిన శ్రీ కోదండ రామాలయము నిర్మించి ఈ వైశాఖమాసంలో 50 సంవత్సరములు అవుతున్నందువలన శ్రీ భగవత్ సేవా సమాజ్ వారు స్వర్ణోత్సవముల వేడుకలు జరుపుచున్నారు. అందులో భాగంగా ఈ మాసం 28 29 30వ తేదీలలో మహా కుంభాభిషేకం జరుగుచున్నందువలన, దానికి సంబంధించి ఈరోజు అనగా 8 5 2025 గురువారం ఏకాదశి తిధి రోజున సంజీవ్ నగర్ రామాలయంలో వెలసిన అందరి దేవతలకు మరియు ధ్వజస్తంభమునకు కళాకర్షణ కార్యక్రమం జరిగినది.కళాకర్షణ కార్యక్రమం అనగా గర్భాలయ గోపురాల అందరి దేవతామూర్తుల మీద ఉన్న శిఖరముల కలశములలో నిక్షిప్తమైన శక్తిని నూతన కలశములలోకి మంత్రోచ్ఛారణతో ఆహ్వానించి ఆ కలశములను తిరిగి కుంబాభిషేకం రోజున పునః ప్రతిష్టించుదురు.

ఈ కార్యక్రమములన్నియు లోక కళ్యాణం కొరకు శ్రీ భగవత్ సేవా సమాజ్ వారు నిర్వహించుచున్నారు.

ఈ కార్యక్రమం అంతయు పుష్పగిరి పీఠాధిపతులు వారి శిష్య బృందంలో ముఖ్యులైన శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.

ఉదయం 7 గంటల నుంచి కలశారాధన, హెూమములు, తదుపరి కళాకర్షణ కార్యక్రమములు, మంత్రపుష్పం మొదలగు కార్యక్రమములు, ఎంతోమంది భక్తుల మధ్య నిర్వహించడం జరిగినది. తదుపరి భక్త బృందమునకు ప్రసాద వితరణ శ్రీ భగవత్ సేవా సమాజ్ వారు చేశారు.





# జిల్లాలో స్పెషల్ డ్రైవ్...అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, లాడ్జిల పై ముమ్మర తనిఖీలు.

**-జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ లలో తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసు అధికారులు.**







ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ మే 08:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ఆదేశాలతో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచనలతో నంద్యాల జిల్లా వ్యాప్తంగా నేటి రాత్రి 9 గం., నుండి 11 గం., ల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది.ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు,లాడ్జీలు, బస్టాండ్ లు, రైల్వేస్టేషన్ లు, బార్డర్ చెక్పోస్టులు ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేసిన పోలీస్ అధికారులు.
ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించాలి. జిల్లాలోని నంద్యాల,ఆళ్లగడ్డ, ఆత్మకూరు,డోన్ అన్ని సబ్ డివిజన్ లలో వారి పోలీస్ స్టేషన్ ల పరిధిలలో సంబంధిత పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 9 మే 2025

# ప్రపంచవ్యాప్తంగా రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

**-డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ. -డోన్ ప్రభుత్వ వైద్యశాల ఇన్చార్జి సూపరిండెంట్ రమ్యశిల్ప.**

**-ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డోన్ కన్వీనర్ కొచ్చెర్వు వెంకటేశ్వర్లు. -సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**









**ఆంధ్ర ప్రగతి డోన్ మే 08:**
డోన్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు రెడ్ క్రాస్ డోన్ కన్వీనర్ కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కోట్ల సుజాతమ్మ అధ్యక్షతన మే 8 న ప్రపంచ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు శ్రీ హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.
ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కె.వి. ఫణిరాజు ,ఓం ప్రకాష్,రవి, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు విశ్వనాథ్ ఆచారి, మేరి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, డోన్ రెడ్ క్రాస్ కన్వీనర్ కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ సమాజానికి సేవలందించిన మహనీయులను మన దేశ స్వాతంత్ర సమరయోధులను, శాస్త్రవేత్తలను,సంఘ సంస్కర్తలను , మహనీయులను సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వామ్యులు కావాలని కోట్ల సుజాతమ్మ పిలుపునిచ్చారు. అలాగే డోన్ ప్రభుత్వ వైద్యశాలలో డోన్ రెడ్ క్రాస్ కన్వీనర్ కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ రమ్య శిల్ప అధ్యక్షతన ప్రభుత్వ ఆసుపత్రి నందు బ్రెడ్లు పంపిణీ చేయడమైనది. అలాగే రైల్వే స్టేషన్ నందు డోన్ లెప్రసీకాలనీ నందు ప్రజలకు బ్రెడ్లు పంపిణీ చేశారు.


# మహనీయుల సేవలు చిరస్మరణీయం.

**-సామాజిక వెత్త డోన్ పి. మహమ్మద్ రఫి.**



**ఆంధ్ర ప్రగతి డోన్ మే 8:**
మే 8 న ప్రపంచ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు శ్రీ హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా మరియు దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణం నందు సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా మరియు మే 8 న ప్రపంచ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు శ్రీ హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.


# నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎన్ఎండి ఫయాజ్.



**ఆంధ్ర ప్రగతి గోస్పాడు మే 08:** నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం తెల్లపురి గ్రామంలో తెలుగుదేశం పార్టీ గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి ఆహ్వానం మేరకు శ్రీశ్రీ యాటగిరి నరసింహస్వామి జీర్ణోదరణ మరియు సంప్రోక్షణ నూతన విగ్రహా గణపతి శివలింగ ఆంజనేయ ధ్వజ స్థిర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు


# జిల్లాలో ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై శిక్షణా తరగతులు ఏర్పాటు.

**-నేరగాళ్ల ఎత్తుగడలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట. -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**


**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ మే 08:**
ఆంధ్రప్రదేశ్ డిజిపి ఆదేశాలమేరకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై శిక్షణ కార్యక్రమం నంద్యాల ఎస్పి అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో నంద్యాల పట్టణ కేంద్రంలోని రామకృష్ణ పీజీ కళాశాల నందుగల ఆడిటోరియంలో ఏర్పాటు చేయడం జరిగింది.జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుండి పోలీస్ అధికారులు స్టేషన్ రైటర్లు ఈ శిక్షణా తరగతులలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుండి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్షాధారాల సేకరణ, వాటి భద్రత ప్రమాణాలు ఎలా పాటించాలి అనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలియజేశారు. కేసుల దర్యాప్తు విషయంలో తప్పుదోవ పట్టించేందుకు నేరస్తులు సాంకేతికంగా కొత్త పద్ధతులను ఉపయోగిస్తున్న సందర్భంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఈ శిక్షణా తరగతులు అందిపుచ్చుకోవాలని కొత్త విషయాలను నేర్చుకోవాలని తెలియజేశారు. ఫోరెన్సిక్ సైన్స్ నందుగల అన్ని విభాగాలకు సంబంధించిన నిష్ణాతులైన వారితో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా నేర పరిశోధన సమయంలో ఆమోదయోగ్యమైన సాక్ష్యం మరియు నేర ప్రక్రియ యొక్క చట్టపరమైన ప్రమాణాల పాటించాలి. డిఎన్ఏ విశ్లేషణ , వేలిముద్రలు , రక్తపు మరకల నమూనాలు , తుపాకీలు , బాలిస్టిక్స్ , టాక్సికాలజీ , మైక్రోస్కోపీ మరియు అగ్ని శిథిలాల విశ్లేషణ వంటి వాటిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాక్షాదారాలు సేకరించాలని వాటిని భద్రపరిచి నేరం చేసిన వ్యక్తికి శిక్షపడేలా ఈ శిక్షణా తరగతుల ద్వారా మంచి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి మంద జావళి , ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద, ఫోరెన్సిక్ సైన్స్ అసిస్టెంట్ లు డాక్టర్ ఎస్. అసిం భాష, డాక్టర్ ఎం. కృష్ణ కుమార్ రెడ్డి, జి శ్యాంప్రసాద్, కుమారస్వామి రెడ్డి లు పాల్గొన్నారు.

# కేశఖండన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎండి ఫయాజ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**
నంద్యాల వైయస్సార్ నగర్ 38 వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు మనవడు తాటికొండ మహేష్ బాబు కుమారుడు తేజశ్విన్ కుమార్ కేశఖండన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ చిన్నారి తేజశ్విన్ కుమార్ ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వైయస్సార్ నగర్ ప్రజలు ఎన్ఎండీ ఫయాజ్ కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తే తాటతీస్తాం

(మొదటి పేజి తరువాయి)
ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు- పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తి నిచ్చేందుకే ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టినట్లు- ఆయన వివరించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే వారికి నూకలు చెల్లినట్లేనని.. ఇది మా హెచ్చరిక అంటూ సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతామని ఆయన తెలిపారు. మేం శాంతి కాముకులమని ఆయన పేర్కొన్నారు. అది మా చేతగానితనం అనుకుని మా ఆడబిడ్డల నుదిటి సిందూరం తుడిచేయాలనుకుంటే.. వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా సమాధానం చెబుతామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉగ్రమూకలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని.. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి అని అన్నారు. బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు- పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి అమరుడయ్యారు మహాత్ముడు. ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈరోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నాం. ఆయన శాంతి సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్న భారతీయులు శాంతిని కోరుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే దిశగా కొనసాగుతున్నారు. మా శాంతి ఆకాంక్షను చేతగానితనంగా భావించి ఎవరైనా మా భూభాగంలో కాలుమోపి.. మా ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేయాలని అనుకుంటే.. ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం. ఆపరేషన్ సిందూర్ ద్వారానే మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి మా వీర జవాన్లకు ఉంది. ఆ వీర జవాన్‌లకు 140 కోట్ల భారతీయులు అండగా నిలబడతారని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇవ్వదలచుకున్నాం అని రేవంత్ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగింది. జాతీయ జెండాలను చేతబూని ర్యాలీగా ముందుకు సాగారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ ర్యాలీలో డిప్యూటీ-సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి
కృష్ణారావు, ఎమ్మెల్సీ విజయశాంతి, సచివాలయ ఉద్యోగులు, మాజీ సైనికాధికారులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళు లర్పించారు. అంతకుముందు గురువారం సాయంత్రం ఈ సంఘీభావ ర్యాలీ సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం పహల్గాం మృతులకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్‌లోని పలువురు మంత్రులు ఘనంగా నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి.. వారి మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలపాటు- మౌనం పాటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ప్రతీకార చర్యగా బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అందులోభాగంగా పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మూకల స్థావరాలను నేలమట్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్య పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

# ఆపరేషన్ సిందూర్... ఏపీ సీఎం చంద్రబాబుకు పటిష్ట భద్రత... డీజీపీ ఆదేశాలు

**మే 08 ఆంధ్ర ప్రగతి :** 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఏపీ పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో పాటు ముఖ్యంగా అతి ముఖ్యమైన వ్యక్తుల (వీఐపీల) భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణ, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన భద్రతాపరమైన వ్యూహాలపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ విభాగపు అధిపతి మహేశ్ చంద్ర ఇతర సీనియర్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ (ఐ%ఎ%ఎస్‌డబ్ల్యూ) అధికారులను డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టంగా ఆదేశించారు.భద్రతా నియమావళిని (సెక్యూరిటీ ప్రొటోకాల్స్) పూర్తిస్థాయిలో, కచ్చితంగా అమలు చేయాలని, ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని ఆయన అధికారులకు గట్టిగా సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనల సందర్భంగా, ముఖ్యంగా జనసమూహంలోకి వెళ్తున్నప్పుడు అనుసరించాల్సిన నిర్దిష్ట నిబంధనలు, ప్రత్యేకంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై నిరంతర నిఘా ఉంచాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎస్పీలకు డీజీపీ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.అనంతరం, రాష్ట్రంలో తీసుకుంటున్న భద్రతా చర్యలు, ముఖ్యమంత్రి భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, భద్రతా చర్యలు అవసరమే అయినప్పటికీ, సామాన్య ప్రజానీకానికి, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైనంత మేరకే భద్రతా ఏర్పాట్లు ఉండాలని, అవి ప్రజలకు ఆటంకంగా మారకూడదని ఆయన స్పష్టం చేశారు.

# అత్యుత్తమ సేవలకు పురస్కారం

### రాష్ట గవర్నర్ నుండి రెడ్ క్రాస్ అవార్డ్ అందుకున్న జిల్లా కలెక్టర్ పి.ం



**కర్నూలు,మే 08 ఆంధ్ర ప్రగతి :**
రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ నుండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కు పురస్కారం లభించింది..2023 -24, 2024-25 సంవత్సరాల్లో బాపట్ల, కర్నూలు జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలందించిన సందర్భంగా గురువారం విజయవాడ రాజ్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ అబ్దుల్ నజీర్ నుండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెడ్ క్రాస్ అవార్డ్ అందుకున్నారు..రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా గడచిన రెండేళ్లలో కర్నూలు, బాపట్ల జిల్లా లలో చేపట్టిన సేవలను ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. కర్నూలు, బాపట్ల జిల్లాల్లో రెడ్ క్రాస్ ద్వారా బ్లడ్ డొనేషన్ క్యాంపులు, ఆర్గాన్ డొనేషన్స్, మెడికల్ క్యాంపులు పల్స్ పోలియో, లెప్రసీ, ఎయిడ్స్ అవేర్నెస్ ర్యాలీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించడాన్ని గవర్నర్ ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ను అభినందించారు..

# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు

### హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిందే

### చెరువులను కబ్జా చేసిన వారిని వదిలి పెట్టేది లేదు

### హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభంలో సిఎం రేవత్



హైదరాబాద్, **మే 08 ఆంధ్ర ప్రగతి ::**
హైడ్రా అంటే కొందరికి కడుపు మంట అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే హైడ్రాపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇళ్లు కూల్చడానికి కాదని.. ఆక్రణదారులను అడ్డుకోవడానికేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మన పూర్వీకులు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. చెరువులు కనుమరుగైతే మన మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు.. హైడ్రా ఉపయోగపడుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో తొలి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులను ఆక్రమించిన వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరేమనుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం హైడ్రా వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. వర్షం వస్తే చెన్నై, ముంబై మహానగరాల పరిస్థితి ఏంటో చూస్తున్నామని ఆయన సోదాహరణగా వివరించారు. కాలుష్యంతో ఢిల్లీ విలవిల్లాడుతోంది.. ఈ పరిస్థితికి మానవ తప్పిదాలే కారణమని ఆయన పేర్కొన్నారు. మంచి పరిపాలన అందించేందుకు గడిచిన 76 ఏళ్లలో.. రాజ్యాంగాన్ని 100 సార్లకుపైగా సవరించుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గుర్తు చేశారు. నగరాభివృద్ధి కోసం గత సీఎంలు ఎన్నో చట్టాలు చేశారన్నారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు చూసి.. అప్పటి నిజాం నవాబు కన్నీరు సైతం పెట్టు-కున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనంతరం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే 122 హైడ్రా వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా తొమ్మిదిన్నర నెలల్లో ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖకు సంబంధించిన అధికారాలు.. హైడ్రా పోలీస్ స్టేషన్ ద్వారా కల్పించారన్నారు. వివిధ సందర్భాల్లో ఈ అధికారాలు తమకు ఉపయోగపడతాయని తెలిపారు. సీఎం ఏ ఉద్దేశ్యంతో హైడ్రాను ప్రారంభించారో.. అదే ఉద్దేశ్యంతో ఈ సంస్థ పని చేస్తుందని వివరించారు. సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు వెళు ుందని చెప్పారు. అసెస్ట్ ప్రొటెక్షన్ మాత్రమే కాకుండా.. డిజాస్టర్ రెస్పాండ్స్ కూడా సరైన అధికారులతో హైడ్రా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానం కూడా పెద్ద ఎత్తులో వాడుతూ ఎఫ్‌టీ-ఎల్ పరిధి గుర్తిస్తున్నామన్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు- ద్వారా ల్యాండ్ గ్రేబింగ్, చీటింగ్, ఫోర్జరీ చేసే వారిపై చర్యలు తీసుకోనే అవకాశం దక్కిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు హైడ్రా ఇలాగే ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ జి. విజయలక్ష్మితోపాటు- పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మిర్చి రైతులకు అండగా తెలంగాణలోనూ మార్కెట్ జోక్యం: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, **మే 08 ఆంధ్ర ప్రగతి :** తెలంగాణ మిర్చి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో నాలుగో వంతు మిర్చి పంటకు మార్కెట్ జోక్యం పథకాన్ని వర్తింపచేయనున్నట్లు ప్రకటించారు. ఆ పథకంలో భాగంగా మిర్చి ధరను రూ.10,374 గా నిర్ధారించినట్లు తెలిపారు. ఆ ధర కంటే మార్కెట్ ధర ఎంత తక్కువైతే అంత మొత్తాన్ని మొదట రాష్ట్రప్రభుత్వం రైతులకు చెల్లించాల్సి ఉంటుందన్నారు.తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తుందని తెలిపారు. ఈ విషయంపై తాను గత నెల 4న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మిర్చిని పండించేందుకు అయిన ఖర్చు కంటే మార్కెట్ ధర తక్కువగ ఉన్నప్పుడు ఈ పథకం ద్వారా రైతులను లబ్ది చేకూరుతుందని కిషన్‌రెడ్డి అన్నారు.

# "ఆమె మా వైఎస్ కుమార్తె కాబట్టి సర్దుకుపోతున్నాం"

**మే 08 ఆంధ్ర ప్రగతి :**
కాంగ్రెస్ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల.. ఏపీ పగ్గాలు చేపడుతూనే.. ఘర్ వాపసీ మంత్రం జపించారు. అంటే.. వైసీపీలోకి వెళ్లిపోయిన కాంగ్రెస్ పాతతరం నాయకులు, యువకులను ఆకర్షించాలని ఆమె భావించారు. ఇదే విషయాన్ని కూడా చెప్పారు. అయితే.. ఆ తర్వాత ఎన్నికలు వచ్చిన క్రమంలో షర్మిలపై విశ్వాసం తోనో.. వైఎస్‌పై అభిమానంతోనో కొందరు నాయకులు తిరిగి వచ్చారు. వీరిలో ఆమంచి కృష్ణమోహన్, కిల్లి కృపారాణి సహా పలువురు ఉన్నారు.ఇక, ఎన్నికల్లో పెరఫార్మెన్స్ దారుణంగా ఉండడం.. తర్వాత కూడా తనను తాను పరిశీలించుకునే ప్రయత్నం చేయకపోవడంతో షర్మిల.. ఘర్ వాపసీ వికటించింది. వచ్చిన వారు కూడా సైలెంట్ అయ్యారు. ఇక, సాకే శైలజానాథ్ సహా.. మరికొందరు దూరమయ్యారు. కట్ చేస్తే.. ఇప్పుడు పరిస్థితి ఏంటంటే.. టీ-బిస్కట్ బ్యాచ్ మాత్రమే షర్మిల వెనుక నిలబడుతున్నారు. కీలకమైన పళ్లం రాజు, జేడీ శీలం వంటి నాయకులు కనిపించడం లేదు.మరోవైపు.. బయటకు వచ్చేందుకు మరికొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఇప్పుడు ఎందుకు చర్చకు వస్తోందంటే.. కూటమిలో లుకలుకలు ఏర్పడుతున్న మాట వాస్తవమే. కానీ, ఒక్కరూ బయటకు రావ డం లేదు. వచ్చినా.. షర్మిలవైపు చూడడం లేదు. ఎవరికి వారుగా ఉంటున్నారు. దీంతో అసలు ఘర్ వాపసీ మంత్రం ఏమైందన్న ప్రశ్న తలెత్తింది. పైగా.. షర్మిల ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నాయకురాలికే ఇమేజ్ లేనప్పుడు ఇతర నాయకుల పరిస్థితి ఏంటన్నది ప్రశ్న.కేంద్రంలోని ఏఐసీసీ త్వరలోనే డీసీసీలలో మార్పులు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో నాయకులు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ఇటీవల విజయవాడకు వచ్చి.. అమరావతిపై రచ్చ చేసిన సమయంలో షర్మిల సీనియర్ నాయకులు ఏరీ? అంటూ ప్రశ్నించారు. దీంతో ఒకరిద్దరిని పోలీసులు నిర్బంధించారని చెప్పారు. కానీ, వాస్తవం ఏంటంటే.. సదరు నాయకులు అసలు గడపే దాటి బయటకు రాలేదు. నిలకడలేని నడక సాగిస్తున్న షర్మిలతో విసుగువస్తోందని అంతర్గత సమావేశాల్లో కుండబద్దలు కొడుతున్నారు. %--%ఆమె మా వైఎస్ కుమార్తె కాబట్టి సర్దుకు పోతున్నాం%--% అనే మాట వినిపిస్తోంది.

## అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా

# విజన్ ప్లాన్ ను రూపొందించాలి

### జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య





**కర్నూలు మే 08 ఆంధ్ర ప్రగతి :**
అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్ ను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు..గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల విజన్ కార్యాచరణ ప్రణాళిక మరియు నియోజకవర్గాల వారిగా విజన్ కార్యాచరణ ప్రణాళికలపై వర్క్‌షాప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా స్టేక్ హోల్డర్ లతో జిల్లా నుండి మండల స్థాయి వరకు సమావేశాలు నిర్వహించి మండల స్థాయిలో ఇన్పుట్ లు తీసుకొని , ఇంటి ఇంటి సర్వే చేసి జిల్లాకి సంబంధించిన 2047 డాక్యుమెంటేషన్ సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు... అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు స్టేట్ విజన్ డాక్యుమెంట్ ను కూడా లాంచ్ చేయడం జరిగిందన్నారు... కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ ప్లాన్ కి అనుసంధానంగా రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర ఏ 2047 డాక్యుమెంటేషన్ ను తయారు చేసుకోవడం జరిగిందన్నారు.. విజన్ ప్లాన్ ఉంటేనే అనుకున్న గమ్యాన్ని నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు వీలవుతుందన్నారు.. సంవత్సరానికి 50 శాతం వృద్ధి సాధించే విధంగా ప్రైమరీ, సెకండరీ, టెర్రిటరీ సెక్టర్ లలో సామర్థ్యాన్ని అంచనా వేసుకొని మన జిల్లాలో ఉన్న రిసోర్స్ లను అంచనా వేసుకుని వేరు వేరు సెక్టార్ ల నుండి వచ్చే కాంట్రిబ్యూషన్ ని పెంచే విధంగా యాక్షన్ ప్లాన్ చేసుకున్నామన్నారు.జిల్లా యాక్షన్ ప్లాన్ అనుసంధానంగా నియోజకవర్గ మండల స్థాయిలో కూడా మైక్రో లెవెల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు.. విజన్ ఆంధ్రలో ఉండే పది సూత్రాలు జీరో పవర్టీ, అగ్రికల్చర్ సెక్టార్, వాటర్ సెక్యూరిటీ, స్కిల్ డెవలప్మెంట్, సోషల్ సెక్యూరిటీ అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్ ను రూపొందించాలన్నారు... సామాజిక భద్రతా పెన్షన్ల విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు.. ప్లానింగ్ డిపార్ట్మెంట్ అడ్వైజర్ సీతాపతి రావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ2047 లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళిక ఏ విధంగా రూపొందించుకోవాలనే విషయంపై ఈరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో రూపొందించే ప్రణాళికకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు.... ప్రతి జిల్లాలో ఉండే నియోజకవర్గ వారిగా వారు రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రి వర్యులు స్వయంగా చూస్తారన్నారు.. నియోజకవర్గ ప్రణాళికను చాలా జాగ్రత్తగా రూపొందించాలని తెలిపారు.. యాక్షన్ ప్లాన్ ఏ విధంగా తయారు చేయాలనే విషయాన్ని పిపిటి ద్వారా హాజరైన సిబ్బందికి వివరించారు..కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, కర్నూల్ ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్, నంద్యాల సిపిఓ వేణుగోపాల్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు..

# గాలి జనార్దన్ రెడ్డిపై అనర్హత వేటు: ఎమ్మెల్యే పదవి రద్దు



**మే 08 ఆంధ్ర ప్రగతి :**
కర్ణాటకకు చెందిన మైనింగ్ వ్యాపారి, గంగావతి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డిపై కర్ణాటక శాసనసభ అనర్హత వేటు వేసింది. అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఆయనను దోషిగా నిర్ధారించడంతో ఈ చర్య తీసుకున్నారు. ఈ మేరకు కర్ణాటక శాసనసభ కార్యదర్శి ఎం.కె. విశాలాక్షి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.
విశాలాక్షి విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, "హైదరాబాద్‌లోని సీబీఐ కేసుల ప్రధాన ప్రత్యేక న్యాయమూర్తి కోర్టు, సీసీ నెం.1 ఆఫ్ 2012లో గంగావతి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కర్ణాటక శాసనసభ సభ్యుడు జి. జనార్దన్ రెడ్డిని దోషిగా నిర్ధారించినందున, ఆయన దోషిగా తేలిన తేదీ అనగా 2025 మే 6 నుంచి కర్ణాటక శాసనసభ సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించడమైనది" అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఇ) మరియు ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 8 నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గాలి జనార్దన్ రెడ్డికి విధించిన శిక్షపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించకపోతే, విడుదలైన నాటి నుంచి మరో ఆరేళ్లపాటు అనర్హత కొనసాగుతుందని వివరించారు. దీంతో కర్ణాటక శాసనసభలో ఒక స్థానం ఖాళీ అయిందని నోటిఫికేషన్‌లో వెల్లడించారు.
మే 6న వెలువడిన ఓబుళాపురం మైనింగ్ కేసు తీర్పులో, గాలి జనార్దన్ రెడ్డితో పాటు మరో ముగ్గురిని సీబీఐ కోర్టు దోషులుగా నిర్ధారించింది. అక్రమ మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి రూ.884 కోట్ల నష్టం కలిగించారని పేర్కొంటూ జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. 2009 నాటి ఈ కేసు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ అవినీతిని వెలుగులోకి తెచ్చింది.ఈ తీర్పును కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వి.ఎస్. ఉగ్రప్ప మాట్లాడుతూ, "జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించడం దేశవ్యాప్తంగా అవినీతి రాజకీయ నాయకులకు బలమైన సందేశం పంపుతుంది. అధికారాన్ని దుర్వినియోగం చేసే నాయకులు చివరికి న్యాయాన్ని ఎదుర్కోవాల్సిందేననడానికి ఇదో ఉదాహరణ" అని అన్నారు. "జనార్దన్ రెడ్డి బృందం 29 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తరలించి, రూ.884 కోట్ల మేర లబ్ధి పొందారని న్యాయమూర్తి నిర్ధారించారు. ఈ దోపిడీలో భాగస్వాములైన వారి ఆస్తులన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను" అని ఆయన డిమాండ్ చేశారు.కాగా, జనార్దన్ రెడ్డి తన కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించి 2024లో తిరిగి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

# ఆ పోలీసు అధికారులపై చర్యలొద్దు

### జెత్వాని కేసులో తదుపరి చర్యలు నిలుపుదల -మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు




అమరావతి,**మే 08 ఆంధ్ర ప్రగతి :**
ముంబయి సినీనటి కాదంబరి జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరిన పోలీసు అధికారులపై తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. క్వాష్ పిటిషన్లపై విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు ప్రాసిక్యూషన్ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ఇప్పటికే ముందస్తు బెయిల్ పొందారని తెలిపారు. %ప్రస్తుత కేసులో వారికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలవబోమని, తుది చార్జ్‌షీట్ దాఖలు చేయబోమని గతంలోనే హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో క్వాష్ పిటిషన్లపై అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వ్యాజ్యాలకు సంబంధించి కౌంటర్ వేయాల్సి ఉందని, విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు స్పందిస్తూ... కౌంటర్ దాఖలు చేసేందుకు ఇప్పటికే ప్రాసిక్యూషన్‌కు వెసులుబాటు ఇచ్చారని, పిటిషనర్ల విషయంలో కేసు ఆధారంగా తదుపరి చర్యలపై స్టే విధించాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కేసు ఆధారంగా అధికారులపై తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

# జగన్ పత్రిక ఎడిటర్ ఇంట్లో పోలీసుల సోదాలు

### జగన్ పీఏ కేఎన్ఆర్ ఇంట్లో కూడా..



విజయవాడ,**మే 08 ఆంధ్ర ప్రగతి :**
జగన్ పత్రిక సంపాదకుడు ఆర్.ధనుంజయ రెడ్డి నివాసంలో విజయవాడ పోలీసులు సోదాలు జరిపారు. జగన్ వ్యక్తిగత సహాయకుడు కె.నాగేశ్వర రెడ్డి (కేఎన్ఆర్) ఇంటికీ వెళ్లారు. విజయవాడ వెటర్నరీ కాలనీలో పక్క పక్క వీధుల్లో వీరు నివాసం ఉంటున్నారు. మద్యం స్కామ్‌లో నిందితులైన మాజీ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అక్కడ ఉండే అవకాశముందన్న సమాచారంతో గురువారం ఈ సోదాలు నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు ముందుగా వారికి సెర్చ్ వారెంట్ ఇచ్చారు.%నిందితుల గురించి కొన్ని ప్రశ్నలు అడిగారు. "వీళ్లిద్దరూ తరచూ మీ వద్దకు వస్తారని సమాచారం ఉంది. వీరి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయి. ఒకవేళ వారు మళ్లీ మీ వద్దకు వస్తే మాకు తెలియజేయండి" అని స్పష్టం చేసి... అక్కడి నుంచి వెళ్లిపోయారు. మద్యం స్కామ్‌లో నిందితుల కోసం ఆరా తీసేందుకు పోలీసులు రాగా... దీనిని జగన్ రోత మీడియా 'పత్రికా స్వేచ్ఛపై దాడి'గా చిత్రీకరించడం గమనార్హం

## క్లైమాక్స్‌కు చేరిన ఐపీఎల్ 2025 సీజన్


# నాలుగు జట్లకు ప్లేఆఫ్స్ బెర్త్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ప్లేఆఫ్స్ రేస్ ఉత్కంఠభరితంగా మారింది. మే 8, 2025 నాటికి, కొన్ని జట్లు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించగా, మరికొన్ని జట్లు పోటీలో నిలిచేందుకు చివరి అవకాశాలను ఆశిస్తున్నాయి. క్రింద ప్రతి జట్టు యొక్క ప్రస్తుత స్థితి, ప్లేఆఫ్స్ అర్హత శాతం, మిగిలిన మ్యాచ్‌లు, అవసరమైన విజయాల వివరాలు ఉన్నాయి. ప్రస్తుతం 1వ స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ అర్హత శాతం: 98.2% ఇక టాప్ 2 ఫినిష్: 73.6% గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను డిల్లీ క్యాపిటల్స్ (మే 11), లక్నో సూపర్ జెయింట్స్ (మే 14), %జం% చెన్నై సూపర్ కింగ్స్ (మే 18) న ఆడనుంది. కాగా ఈ మ్యాచుల్లో 1 విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌కు సరిపోతుంది. 2 విజయాలు టాప్ 2 ఫినిష్ చేయవచ్చు. ప్రస్తుతం 2వ స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్స్ అర్హత శాతం: 99.1% ఇక టాప్ 2 ఫినిష్: 69.0% గా ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మిగిలిన మ్యాచ్‌లను లక్నో సూపర్ జెయింట్స్ (మే 9), సన్‌రైజర్స్ హైదరాబాద్ (మే 13), కోల్కతా నైట్ రైడర్స్ (మే 17) న ఆడనుంది. కాగా ఈ మ్యాచ్ ల్లో 1 విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌కు ఖచ్చితంగా వెళు ంది. 2 విజయాలు ఉంటే టాప్ 2 ఫినిష్‌ను దాదాపుగా నిర్ధారిస్తాయి. ప్రస్థుతం 3వ స్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్ప్లేఆఫ్స్ అర్హత శాతం: 88.0% ఇక టాప్ 2 ఫినిష్: 37.6% గా ఉంది. పంజాబ్ కింగ్స్ మిగిలిన మ్యాచ్‌లను డిల్లీ క్యాపిటల్స్ (మే 8), ముంబై ఇండియన్స్ (మే 11), రాజస్థాన్ రాయల్స్ (మే 16) న ఆడనుంది. పంజాబ్ కింగ్స్ 2 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్‌కు ఖచ్చితంగా వెళ్తుంది. 1 విజయం బలమైన నెట్ రన్ రేట్ ఉంటే టాప్ 2 ఫినిష్‌కు సహాయపడుతుంది. ప్రస్థుతం 4వ స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ అర్హత శాతం: 69.9% ఇక టాప్ 2 ఫినిష్: 13.3% గా ఉంది. ముంబై ఇండియన్స్ మిగిలిన మ్యాచ్‌లను పంజాబ్ కింగ్స్ (మే 11), డిల్లీ క్యాపిటల్స్ (మే 15) తో ఆడనుంది. ముంబై ఇండియన్స్ 2 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్‌కు దాదాపుగా వెళ్తుంది, టాప్ 2 ఫినిష్‌కు రెండు విజయాలు అవసరం . ప్రస్థుతం 5వ స్థానంలో ఉన్న డిల్లీ ప్లేఆఫ్స్ అర్హత శాతం: 42.6% గా ఉంది. ఇక టాప్ 2 ఫినిష్: 5.2% ఉంది. డిల్లీ మిగిలిన మ్యాచ్‌లను పంజాబ్ కింగ్స్ (మే 8), గుజరాత్ టైటాన్స్ (మే 11), ముంబై ఇండియన్స్ (మే 15) తో ఆడనుంది. 3 విజయాలు ప్లేఆఫ్స్ ఆశలను నిలుపుతాయి, ప్రత్యక్ష పోటీదారులపై విజయాలు అవసరం. ప్రస్థుతం 7వ స్థానంలో ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్ అర్హత శాతం: 0.7% గా ఉంది. టాప్ 2 ఫినిష్: 0.0% గా ఉంది. లక్నో సూపర్ జెయింట్స్ మిగిలిన మ్యాచ్‌లను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (మే 9), గుజరాత్ టైటాన్స్ (మే 14), సన్‌రైజర్స్ హైదరాబాద్ (మే 18) న ఆడనుంది. లక్నో సూపర్ జెయింట్స్ మిగిలిన అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించాల్సి ఉంటుంది. అంతే కాదు నెట్ రన్ రేట్‌ను గణనీయంగా మెరుగు పరచాలి.

# వరుణ్ చక్రవర్తిపై బీసీసీఐ కన్నెర్ర

## మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా



చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన కీలక మ్యాచ్ లో ఓడిన బాధలో ఉన్న కోల్ కతా నైట్ రైడర్స్ కు షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై బీసీసీఐ కన్నెర్ర చేసింది. అభ్యంతరకరంగా సిగ్నల్ చేసినందుకుగాను అతడిపై కొరడా ఝళిపించింది. బుధవారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కోల్ కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. అజింక్య రహానే కెప్టెన్ ఇన్నింగ్స్ (33 బంతుల్లో 48, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) తో సత్తా చాటాడు. బౌలర్లలో నూర్ అహ్మద్ నాలుగు వికెట్లు తీశాడు. ఛేజింగ్ లో చెన్నై 19.4 ఓవర్లలో 8 వికెట్లకు 183 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రివిస్ విధ్వంసకర ఫిఫ్టీ (25 బంతుల్లో 52, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. వైభవ్ అరోరా కు మూడు వికెట్లు దక్కాయి. అయితే ఈమ్యాచ్ లో బ్రివిస్ ను ఔట్ చేసిన తరవాత ఇక ఇక్కడి నుంచి వెళ్లిపో అన్నట్లుగా వరుణ్ చేతితో సంజ్ఞ చేశాడు. తాజాగా దీనిపై ఐపీఎల్ యాజమాన్యం కన్నెర్ర చేసింది. ఐపీఎల్ ప్లేయర్ల ప్రవర్తన నియామవళిని ఉల్లంఘించినందుకుగాను అతనికి మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది. అతను పాల్పడిన నేరం ఆర్టికల్ లోని 2.5లోని లెవల్ 1 కిందకి వస్తుందని మ్యాచ్ రిఫరీ నిర్ణయించి, జరిమానా విధించి, ఒక డీ మెరిట్ పాయింట్ కూడా కేటాయించినట్లు పేర్కొంది. రిఫరీ నిర్ణయమే ఫైనల్ అని దీనిపై ఇక వాదోపవాదాలకు అవకాశం లేదని తెలిపింది. మరోవైపు గతేడాది చాంపియన్ గా నిలిచి, ఈ ఏడాది డిఫెండింగ్ చాంపియన్ గా బరిలోకి దిగిన కేకేఆర్ ప్లే ఆఫ్ రేస్ ఎలిమినేషన్ ముంగిట నిలిచింది. ఇప్పటివరకు 12 మ్యాచ్ లు ఆడిన ఆ జట్టు ఐదు విజయాలు, ఒక రద్దుతో కలిపి 11 పాయింట్లతో ఉంది. లీగ్ లో ఇంకా రెండు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. కేకేఆర్ ఆడాల్సిన మ్యాచ్ ల విషయానికొస్తే ఈనెల 10న హైదరాబాద్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ తో అలాగే ఈనెల 17న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో బెంగళూరులో మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్ లు గెలవడంతోపాటు మిగతా జట్ల ఫలితాలు కూడా కేకేఆర్ కు అనుకూలంగా రావాల్సి ఉంది. ఏదేమైనా మూడుసార్లు చాంపియన్ గా నిలిచిన కేకేఆర్ ఈసారి మాత్రం ప్లే ఆఫ్స్ కు చేరుకోవడం చాలా కష్టంగా మారింది. ఇక ఈ సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్తాన్ రాయల్స్, సన్ రైజర్స్ ఆల్రెడీ ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే. ఈ ఆదివారం వరకు ప్లే ఆఫ్ విషయంలో మరింత క్లారిటి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ టాప్ ప్లేస్ లో నిలిచింది.



# శ్రీకాంత్‌కు ఆయుష్ షాక్

తైపీ: భారత యువ షట్లర్లు ఆయుష్ షెట్టి, ఉన్నతి హుడా తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో జోరు కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో వారు సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అడుగు పెట్టారు. గురువారం హెూరాహెూరీగా జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 20 ఏళ్ల ఆయుష్ 21-16, 15-21, 21-17తో సీనియర్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌కు షాకిచ్చాడు. తొలి రౌండ్‌లో..ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప రన్నరప్ లీ చియాను కంగుతినిపించిన ఆయుష..క్వార్టర్స్‌లో ఏడో సీడ్ బ్రియాన్ యంగ్ (కెనడా)తో అమీతుమీ తేల్చుకుంటాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఉన్నతి 21-12, 21-17తో స్థానిక క్రీడాకారిణి లిన్ యున్‌పై నెగ్గింది.



# అర్ధంతరంగా నిలిచె ఐపీఎల్‌పై నీలినీడలు

## ఉద్రిక్తతల నేపథ్యంలో పంజాబ్-ఢిల్లీ మ్యాచ్ రద్దు

ధర్మశాల: ఐపీఎల్ చరిత్రలోనే ఎన్నడూ చూడని అరుదైన ఘటన ఇది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మ్యాచ్ భద్రతా కారణాల రీత్యా మధ్యలోనే ఆగింది. గురువారం రాత్రి జమ్మూ, పఠాన్‌కోట్‌లపై పాక్ దాడులకు తెగబడింది. దీంతో ముందు జాగ్రత్తగా ధర్మశాలలో బ్లాక్‌అవుట్ ప్రకటించగా, ఇక్కడే జరుగుతున్న మ్యాచ్‌ను కూడా అర్ధంతరంగా రద్దు చేశారు. వాస్తవానికి పంజాబ్ ఇన్నింగ్స్ 10.1 ఓవర్లపాటు సజావుగానే సాగింది. ఆ తర్వాత ఒక్కసారిగా స్టేడియంలోని ఓ ఫ్లడ్‌లైట్ ఆఫ్ అయ్యింది. మొదట ఏదైనా సమస్య వచ్చిందేమోనని అంతా భావించారు. కానీ కాసేపటికే మరో రెండు ఫ్లడ్‌లైట్లను ఆపేయడంతో స్టేడియంలో చీకటి నెలకొంది. అప్పటికే ఆటగాళ్లతో పాటు అంపైర్లు కూడా మైదానం వీడారు. అలాగే స్టేడియంలోని ప్రేక్షకులను కూడా బయటికి వెళ్లాల్సిందిగా అధికారులు కోరారు. ఈ క్రమంలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా స్థానిక పోలీసులు, ఆర్మీ సిబ్బంది పర్యవేక్షించారు. మరోవైపు పటిష్ట భద్రత మధ్య ఇరు జట్ల ఆటగాళ్లను స్టేడియం నుంచి హెూటళ్లకు తరలించారు.

ఈ మ్యాచ్ ఆగే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో 122/1 స్కోరుతో ఉంది. ప్రియాన్ష్ ఆర్య (34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 70), ప్రభ్‌సిమ్రన్ (28 బంతుల్లో 7 ఫోర్లతో 50 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించారు.



ఓపెనర్ల జోరు: వర్షం కారణంగా ఈ మ్యాచ్ గంట ఆలస్యంగా ఆరంభమైంది. అయితే టాస్ గెలిచిన పంజాబ్ బ్యాటింగ్‌కే మొగ్గు చూపింది. కెప్టెన్ శ్రేయాస్ నిర్ణయాన్ని ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య వమ్ము చేయలేదు. డీసీ బౌలర్లను చెడుగుడు ఆడేస్తూ పరుగుల వరద పారించారు. ఆర్య ఇన్నింగ్స్ తొలి రెండు బంతులను ఫోర్లుగా మలచగా.. అటు ప్రభ్ మూడో ఓవర్‌లో మూడు ఫోర్లు రాబట్టాడు. ఇక చమీర ఓవర్‌లో ఆర్య మరింతగా చెలరేగడంతో 6,4,4తో 18 రన్స్ సమకూరాయి. అయితే ఆరో ఓవర్‌లో పేసర్ నటరాజన్ కేవలం నాలుగు పరుగులే ఇచ్చినా అప్పటికే పవర్‌ప్లేలో 69 స్కోరుతో పటిష్టంగా నిలిచింది. ఆ తర్వాత ఆర్య ఓ సిక్సర్‌తో 25 బంతుల్లోనే తన అర్ధసెంచరీని పూర్తి చేశాడు. కుల్దీపను కూడా వదలకుండా తను పదో ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదగా.. ప్రభ్ ఓ ఫోర్‌తో వరుసగా నాలుగో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. పదో ఓవర్‌లోనే స్కోరు 122కి చేరిన వేళ.. పేసర్ నటరాజన్ ఈ ప్రమాదకర జోడీని విడదీశాడు. 11వ ఓవర్‌తో తొలి బంతికే ఆర్యను అవుట్ చేశాడు. ఆ వెంటనే శ్రేయాస్ క్రీజులోకి రావడం.. ఫ్లడ్‌లైట్లను ఆపివేయడం జరిగింది. కాసేపటికే అంపైర్లు, ఆటగాళ్లు మైదానం వీడారు.

**సాంకేతిక కారణమన్న బీసీసీఐ**

బీసీసీఐ మాత్రం స్టేడియం ఉన్న ప్రాంతంలో విద్యుత్ సమస్య కారణంగా ఓ ఫ్లడ్‌లైట్‌లో లోపం తలెత్తిందని, అందుకే మ్యాచ్‌ను రద్దు చేశామని ప్రకటించింది.

**లీగ్ కొనసాగేనా?**

పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఐపీఎల్ కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది. గురువారం ధర్మశాలలో మ్యాచ్ ఇన్నింగ్స్ మధ్యలోనే ఆగిపోవడం పరిస్థితి తీవ్రతను చాటిచెబుతోంది. అలాగే లీగ్‌లో విదేశీ ఆటగాళ్లు కూడా ఎక్కువగానే ఉన్నారు. వారి భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే వారు తమ ఆందోళనను బీసీసీఐకి తెలియజేశారు. ఇదే విషయమై బోర్డు అత్యవసరంగా సమావేశమైంది. సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ.. మ్యాచ్‌ల కోసం ఆటగాళ్లంతా వివిధ ప్రాంతాలకు ప్రయాణించడం ఏమేరకు క్షేమకరమనేది బోర్డు ఆలోచిస్తోంది. కొన్ని నగరాల్లో విమానాశ్రయాలు మూసివేయడంతో సదరు జట్ల ఆటగాళ్లను మ్యాచ్‌ల వేదికలకు తరలించడం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించడం సబబేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. మరి.. బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# కెప్టెన్‌గా కేఎల్ రాహుల్..?

## ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టు ఎంపికపై కసరత్తు



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సింపుల్‌గా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బుధవారం తన నిర్ణయాన్ని వెల్లడించాడు. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతానని తెలిపాడు. రోహిత్ శర్మ ఆకస్మిక నిర్ణయంతో టీమిండియా తదుపరి టెస్ట్ కెప్టెన్ ఎవరా? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఐపీఎల్ 2025 సీజన్ అనంతరం టీమిండియా ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్ ఈ సిరీస్‌తోనే ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే ఈ సిరీస్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. అంతేకాకుండా ఇటీవల టెస్ట్ ఫార్మాట్‌లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా.. ఆస్ట్రేలియా గడ్డపై 1-3తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కోల్పోయింది. ఈ వైఫల్యంతో డబ్ల్యూటీసీ 2025 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయింది. ఈ వరుస వైఫల్యాల నేపథ్యంలోనే భారత సెలెక్టర్లు టెస్ట్ ఫార్మాట్‌లో కొత్త జట్టును తయారు చేయడంపై ఫోకస్ పెట్టారు. ఓవైపు ఐపీఎల్ 2025 సీజన్ జరుగుతుండగానే మరోవైపు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టును ఎంపిక చేయడంపై సెలెక్టర్లు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. తమ ప్రణాళికలను రోహిత్ శర్మకు స్పష్టంగా తెలియజేయడంతోనే అతను రిటైర్మెంట్ ప్రకటించినట్లు అర్థమవుతోంది. మరో వారం రోజుల్లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత టెస్ట్ జట్టును ప్రకటించే అవకాశం ఉంది. టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌తో పాటు జస్‌ప్రీత్ బుమ్రా పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బుమ్రా.. టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. కానీ గాయాల బెడద, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అతన్ని లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించే యోచనలో సెలెక్టర్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అంతేకాకుండా ఇంగ్లండ్ పర్యటనలో బుమ్రా ఐదు మ్యాచ్‌లకు ఐదు ఆడలేని పరిస్థితి. వర్క్‌లోడ్‌లో భాగంగా అతను రెండు టెస్ట్‌ల వరకు దూరమయ్యే ఛాన్స్ ఉంది. కాబట్టి శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో ఒకరి టెస్ట్ కెప్టెన్సీ దక్కవచ్చు. అనుభవానికి ప్రాధాన్యత ఇస్తే కేఎల్ రాహుల్‌కు టెస్ట్ కెప్టెన్సీ దక్కుతుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# చిన్నసినిమాల్లో చాలా పెద్దసినిమా



మల్లేశం, 8 ఏఎం మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుంచి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ '23' తో వస్తున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. సినిమా మే 16న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో ప్రియదర్శి, ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ చీఫ్ గెస్ట్ లు గా హాజరైన ఈ వేడుక గ్రాండ్ గా జరిగింది. ఈ వేడుకలో లిరిసిస్ట్ చంద్రబోస్ మాట్లాడుతూ "సృజనాత్మకతకి పెద్దపీట వేసే దర్శకుడు రాజ్. ఈ సినిమాలో మంచి సాహిత్యం రాసే అవకాశం దొరికింది. ఈ సినిమాలో నటించిన నటీనటులంతా చాలా సహజంగా పాత్రలలో ఒదిగిపోయారు. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతుంది"అని అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ "చాలా గొప్ప సినిమా ఇది. ఇలాంటి గొప్ప ఆలోచన, కథతో ప్రేక్షకులు ముందుకు వస్తున్న రాజ్‌ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది"అని పేర్కొన్నారు. డైరెక్టర్ రాజ్ రాచకొండ మాట్లాడుతూ "చిన్న సినిమాల్లో ఇది చాలా పెద్ద సినిమా. థియేటర్ కోసం చాలా శ్రద్ధ తీసుకుని టెక్నికల్‌గా చాలా ఫోకస్ తో చేసిన సినిమా ఇది. ఇది థియేటర్‌కి పర్ఫెక్ట్ సినిమా. దయచేసి ఈ సినిమాని థియేటర్స్ లో చూడండి"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తన్మై, తేజ, పవన్ రమేష్, ప్రణీత్ పాల్గొన్నారు.

# సుమంత్ కొత్త సినిమా
## డైరెక్ట్ ఓటీటీలో

సన్నీ సంజయ్ దర్శకత్వంలో సుమంత్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న మూవీ 'అనగనగ'. రాకేష్ రెడ్డి గడ్డం, రుద్ర మాదిరెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాలో కాజల్ చౌదరి కథానాయికగా కనిపించనుంది.. కాగా, ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను సృష్టించింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్ ని అనౌన్స్ చేశారు. మే 15 నుంచి ఈ సినిమా ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానున్నట్టు ప్రకటించారు.




# ప్రెగ్నెన్సీ జర్నీలో ఎన్నో ఛాలెంజెస్



బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ఎంత పెద్ద స్టార్ అనేది అందరికీ తెలిసిందే. బాలీవుడ్ లోని తన సహనటుడు రణ్‌వీర్ సింగ్ ను 2018లో ప్రేమించి పెళ్లి చేసుకున్న దీపికా గతేడాది సెప్టెంబర్ లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ప్రెగ్నెన్సీ టైమ్ లో కొన్నాళ్లు, పాప పుట్టిన తర్వాత కొన్నాళ్ల పాటూ సినిమాలకు దూరంగా ఉన్న దీపికా తిరిగి ఇప్పుడు షూటింగుల్లో పాల్గొనడానికి రెడీ అవుతోంది. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో దీపికా తన ప్రెగ్నెన్సీ జర్నీ గురించి, తల్లిగా మారిన తర్వాత ప్రయాణం గురించి పలు విషయాలను షేర్ చేసుకుంది. కడుపుతో ఉన్నప్పుడు నెలలు నిండేకొద్దీ ఎంతో కష్టమనిపించినట్టు చెప్పిన దీపికా ఆ జర్నీలో ఎన్నో ఛాలెంజెస్‌ను ఎదుర్కొన్నట్టు తెలిపింది. మరీ ముఖ్యంగా నెలలు నిండిన తర్వాత ఎంతో కష్టంగా అనిపించిందని దీపికా వెల్లడించింది. ఆ టైమ్ లో తన ఫ్రెండ్స్, ఫ్యామిలీ తనతోనే ఉండటాన్ని అదృష్టంగా భావించానని చెప్తున్న దీపిక తన కూతురికి పేరు పెట్టే విషయంలో ఎంతో ఆలోచించానని, దాని కోసం ఎంతో రీసెర్చ్ చేశానని, చివరకు దువా అనే పేరుని డిసైడ్ చేసినట్టు దీపికా చెప్పుకొచ్చింది. దువా అంటే అర్థమేంటో తెలియక చాలామంది తనను అడిగారని కూడా దీపికా ఈ సందర్భంగా వెల్లడించింది. దువా అనే పేరుకు అర్థం ప్రార్థన అని చెప్పిన దీపిక తల్లిగా ఓ వైపు కూతురి బాధ్యతల్ని చూసుకుంటూనే నటిగా షూటింగులకు హాజరవడం ఎప్పుడూ సవాలేనని, ప్రస్తుతం తాను మదర్‌హుడ్ ను ఎంజాయ్ చేస్తున్నానని, త్వరలోనే షూటింగుల్లో జాయిన్ అవుతానని చెప్పిన ఆమె, తన కూతురికి తల్లిగా ఉంటూనే షూటింగ్స్ లో పాల్గొంటానని చెప్పింది. అయితే దీపికా ఈ మధ్యన కొత్త సినిమాలేమీ ఒప్పుకోలేదు. ఆమె నుంచి ఆఖరిగా సింగం అగైన్ అనే సినిమా వచ్చింది. ఆ సినిమాలో దీపిక ఎంతో పవర్‌ఫుల్ క్యారెక్టర్ లో కనిపించింది. దీంతో పాటూ గతేడాది ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన కల్కి 2898ఏడీ సినిమాలో కూడా దీపిక సుమతి అనే ఎంతో శక్తివంతమైన పాత్రలో నటించింది. ప్రస్తుతం కల్కి2 కు సంబంధించిన వర్క్ జరుగుతున్నాయి.

# మంచు మనోజ్ 'అత్తరు సాయిబు'?

మంచు మనోజ్ ఒకానొక టైమ్ లో.ఒకేసారి రెండు మూడు ప్రాజెక్టులతో బిజీగా కొనసాగాడు. తనకంటూ ఒక ప్రత్యేకమైన మాస్ ఇమేజ్ కూడా సెట్ చేసుకున్నాడు. కానీ కమర్షియల్ సరైన బిగ్ హిట్ చూడలేదు. ఇక వరుస ఫ్లాప్స్ అనంతరం కొంత కాలం గ్యాప్ తీసుకున్న మనోజ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో కొత్త సినిమాలతో సర్ ప్రైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల 'భైరవం' సినిమాతో రీఎంట్రీ ఇచ్చిన మనోజ్, 'మిరాయ్'లో విలన్‌గా కనిపించనున్నాడు. అయితే, గతంలో మొదలుపెట్టిన 'వాట్ ద ఫిష్', 'అహం బ్రహ్మాస్మి' సినిమాలు మధ్యలోనే ఆగిపోయాయి, వాటికి సంబంధించిన అప్‌డేట్స్ కూడా రాలేదు. ఇప్పుడు మరో కొత్త సినిమాతో మనోజ్ తన అభిమానులను ఆకట్టుకునేందుకు రెడీ అవుతున్నాడు. మనోజ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో 'భైరవం' సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తి చేశాడు. ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్ కూడా నటించారు, ఇది ఒక మినీ మల్టీస్టారర్‌గా రూపొందింది. మనోజ్ మొదట తన అన్న విష్ణు మంచు నటించిన 'కన్నప్ప' సినిమాకు పోటీగా 'భైరవం'ను ఏప్రిల్ 25న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారని టాక్ గట్టిగానే వచ్చింది. 'కన్నప్ప' రిలీజ్ డేట్ ప్రకటించిన వెంటనే 'భైరవం' టీమ్ కూడా అదే రోజున రిలీజ్ చేస్తే హాట్ టాపిక్ గా నిలిచే అవకాశం ఉంటుంది.ఏదేమైనా, 'కన్నప్ప' జూన్ 27కి వాయిదా పడటంతో 'భైరవం' రిలీజ్ కూడా వాయిదా పడింది. ఇప్పుడు మనోజ్ మరో కొత్త సినిమాతో సిద్ధమవుతున్నాడు. '90 ఎం.ఎల్' ఫేమ్ శేఖర్ రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రానికి 'అత్తరు సాయిబు' అనే టైటిల్ ఖరారు చేసినట్లు సమాచారం. ఈ టైటిల్ వినగానే ఇది ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగే కామెడీ సినిమా అని అర్థమవుతుంది. కొద్ది రోజులుగా కథా చర్చలు జరుగుతున్నాయి, ఇప్పుడు అవి ఓ కొలిక్కి వచ్చాయి.





# రౌడీ జనార్ధన్ 6 నెలలు టార్గెట్..!

విజయ్ దేవరకొండ ప్రస్తుతం కింగ్ డమ్ ని ఈ నెల చివరి కల్లా రిలీజ్ చేసేందుకు కృషి చేస్తున్నాడు. ఈ సినిమా తర్వాత రౌడీ జనార్ధన్ అని రాబోతున్నాడు. రవికిరణ్ కోలా డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లబోతుంది. ఐతే ఈ సినిమాను %AI% టెక్నాలజీని ఉపయోగించి భారీ ప్లానింగ్ తో వస్తున్నారు. రౌడీ జనార్ధన్ సినిమాను దిల్ రాజు ఒక టార్గెట్ పెట్టుకుని మరీ పూర్తి చేసేలా చూస్తున్నారట. సినిమాను 6 నెలల్లో పూర్తి చేసేలా పర్ఫెక్ట్ షెడ్యూల్ ని సిద్ధం చేశారట. ఈమధ్య పాన్ ఇండియా సినిమాలన్నీ కూడా ఏడాదిలో పూర్తి చేయాలని మొదలు పెట్టి రెండేళ్ల దాకా లాగిస్తున్నారు. అంతేకాదు అనుకున్న రిలీజ్ డేట్ కి సినిమాను తీసుకు రావట్లేదు. కానీ దిల్ రాజు మాత్రం రౌడీ జనార్ధన్ విషయంలో అలా కాకుండా ముందు నుంచి జాగ్రత్త పడేలా చూస్తున్నాడు. రౌడీ జనార్ధన్ సినిమా అనౌన్స్ మెంట్ తోనే కత్తి నాదే నెత్తురు నాదే యుద్ధం నాతోనే అంటూ ఒక క్రేజీ పోస్టర్ వదిలారు. ఆల్రెడీ కింగ్ డం తో భారీ అటెంప్ట్ చేస్తున్న విజయ్ దేవరకొండ నెక్స్ట్ రాబోతున్న రౌడీ జనార్ధన్ తో కూడా గట్టి ప్లానింగ్ తోనే వస్తున్నాడని అర్థమవుతుంది. రౌడీ జనార్ధన్ సినిమా కథ కూడా అద్భుతంగా వచ్చిందట. అందుకే సినిమా విషయంలో దిల్ రాజు నో కాంప్రమైజ్ అనేలా ప్లాన్ చేస్తున్నాడట. విజయ్ దేవరకొండ ఈ సినిమా తర్వాత రాహుల్ సంకృత్యన్ డైరెక్షన్ లో కూడా సినిమా లైన్ లో పెట్టాడు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఆ సినిమా పీరియాడికల్ కథతో రాబోతుందని తెలుస్తుంది.



# దానికింకా టైముంది

రీసెంట్ గా టాలీవుడ్ లోని ఇద్దరు హీరోయిన్లు ప్రెగ్నెంట్స్ అనే విషయంపై వార్తల్లో నిలిచారు. వాళ్లే శోభితా ధూళిపాల, లావణ్య త్రిపాఠి. గత కొన్ని రోజులుగా ఆ ఇద్దరి తీరు చూసి అందరూ వాళ్లను ప్రెగ్నెంట్స్ అని భావిస్తూ వచ్చారు. రీసెంట్ గా లావణ్య తాను ప్రెగ్నెంట్ అనే విషయాన్ని కన్ఫర్మ్ చేయగా, ఇప్పుడు ఈ విషయంలో శోభిత క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం తాను వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నానని, తల్లి అయ్యే విషయంలో ఇంకా ఎలాంటి డెసిషన్ తీసుకోలేదని తెలిపింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న నాగ చైతన్య, శోభిత ధూళిపాల 2024 డిసెంబర్ లో ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లి చేసుకుని ఒకటైన విషయం తెలిసిందే. వీరి పెళ్లి అయినప్పటి నుంచి శోభిత ప్రెగ్నెంట్ అనే వార్త నిత్యం పుట్టిస్తూనే ఉన్నారు.' దానికి తోడు రీసెంట్ గా జరిగిన వేవ్స్ సమ్మిట్ కు తన భర్తతో కలిసి చీరలో రావడంతో ఇక బాలీవుడ్ మీడియా శోభిత ప్రెగ్నెంట్ అనే విషయాన్ని కన్ఫర్మ్ చేస్తూ ఎన్నో కథనాలను ప్రచురించింది. ఎప్పుడూ మోడ్రన్ గా కనిపించే శోభిత, తన బేబీ బంప్ ను కవర్ చేయడానికి భిన్నంగా చీరలో వచ్చిందని పలు వార్తలొచ్చాయి. ఈ విషయంలో అటు చైతన్య కానీ, ఇటు శోభిత కానీ మాట్లాడకపోవడంతో శోభిత ప్రెగ్నెన్సీ నిజమే అనుకున్నారంతా. కానీ శోభిత తాజాగా ఈ విషయంలో క్లారిటీ ఇవ్వడంతో ఆ వార్తలకు ఫుల్ స్టాప్ పడింది. శోభిత మాటల్ని బట్టి చూస్తుంటే అక్కినేని వారసులు రావడానికి ఇంకాస్త టైమ్ పట్టనుందని అర్థమవుతుంది.